పొగలేని నిప్పు

ఇది మామయ్య చెప్పిన కథ. అనేక పల్లెటూళ్ళలో ఉద్యోగం చేసి నాలుగైదేళ్ళ క్రితం రిటైరయ్యాడు మామయ్య. వెనుకటి తరం, అంటే పాతిక, ముప్పైయ్యేళ్ళ క్రితం నాటి పల్లెటూరి జీవితం, ప్రజలూ ఆయనకి బాగా తెలుసు. ఆనాటి వ్యక్తుల్ని గురించి చిత్రమైన కథలు చెప్తూంటాడు. అవి వింటున్నంతసేపూ, ఆ కాలపు జగత్తులోకి ప్రవేశించి ఆ వ్యక్తుల ప్రవర్తనద్వారా జీవితాన్ని అర్థంచేసుకున్నట్లు భావించి ఆనంద పడుతూంటాను.

మామయ్య చెప్పే కథల్లో హుందాతనం తక్కువ. కొంచెం వస్తువు—అత్తయ్య దూరంగా వంటింట్లో వున్నప్పుడు కాస్తంత చిలిపి మాటలు; అటూ ఇటూ చూసి, వొకపాలు బూతు వాడతాడు. నాగరికత ప్రబలి, నాజూకు వ్యాపించిన తర్వాత బూతు, అశ్లీలం కుంటుపడ్డాయను కుంటాను. ఈ రెండూ, వెనుకటి తరం గ్రామీణ జీవితంతో మనకున్న లంకె. జీవితంలో కోరినవాటిని పొందలేనివారికి బూతేశరణ్యం అన్న వాదం కూడా వొకటుంది. లలితకళల్ని వొక పంటభూమిగా పరిగణిస్తే, బూతుని దానికి ఎరు వనొచ్చు.

"పొగ లేకుండా నిప్పు రాజేసి వంట చేస్తుందిరా మీ అత్తయ్య" అన్నాడు మామయ్య.

"అదేమిటి మామయ్యా – నిప్పు లేకుండా పొగ రాదన్న సామెత నెరుగుదుం గాని, పొగలేని నిప్పేమిటి ?" అన్న ప్రశ్నకు సమాధానంగా మామయ్య చెప్పిన కథ యిది.

ఇది పాత కాలపు కథ గావున ఆ ధోరణిలోనే మొదలెడతాను.

అనగనగా వొక ఊరు. ఊరు చివర కోనేరు. గట్టున పెద్ద రావి చెట్టు. దాని వెనుక ఆలయం. ముందుగా ఎడమవైపు రెండిళ్ళు. ఒకింట్లో నాగయ్యా, ఆయన భార్య సీతారత్నం కాపుర ముంటున్నారు. రెండో దాంట్లో పార్వతీ ఆమె భర్త భాస్కరం వుంటాన్నారు. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. నాగయ్యకి ఏదో వ్యాపారంకూడా వుంది. భాస్కరం కంటె స్థితిపరుడు. కాని భాస్కరం, నాగయ్యకంటె ఎక్కువ చదువుకున్నవాడు. కళాశాలలో ఒక ఏడు చదివి పరిస్థితుల వొత్తిడివల్ల మానేసి, భూములు చూసుకుంటున్నాడు. ఈ కథ ప్రారంభమైనప్పుడు ఆయన వయస్సు ఇరువై తొమ్మిది పెండ్లయింది; ఇద్దరు సంతానం, కిష్టయ్యకి ఏడేళ్లు. 'పాపాయికి' మూడేళ్లు. భార్య పార్వతమ్మ చాలా చక్కందని ఊళ్ళో చెప్పుకుంటారు. భాస్కరం లోలోన నవ్వుకుంటాడు.

అసలు, ఈ విషయం ప్రస్తావించింది. సీతారత్నం – పక్కింటి నాగయ్య భార్య. రెండిళ్ళకి మధ్య మట్టిగోడ ఒకటుంది. భాస్కరం ఎత్తరి. కాలి బొటనవ్రేళ్ళమీద నిలబడితే, పక్కింట్లో జామచెట్టుకింద పనిచేసుకుంటున్న సీతారత్నం కనబడుతుందికూడా. అరుగెక్కి గుమ్మంమీద నిలబడితే, సీతారత్నంని బాగా చూడొచ్చు. వీలున్నప్పుడల్లా ఆమెను అలా చూస్తోండడం అలవాటయిపోయింది భాస్కరంకి. ఆమె కూడా అతనికేసి చూస్తూ వుండేది. అప్పుడప్పుడు కొంత కాలానికి రెండిళ్ళకి మధ్యనున్న గోడలో ఒక మూలగా, ఒక రంధ్రం యేర్పడింది. ఆ పని భాస్కరం చేశాడో, ఏ పాలేరేనా చేశాడో, యెద్దుకొమ్ము తగిలి కంత పడిందో చెప్పడం కష్టం. ఆ కంతద్వారా సీతారత్నాన్ని పలకరించడంతో ప్రారంభమయి, పిచ్చాపాటి చెప్పుకోవడం మామూలైంది. మరికొన్నాళ్ళకు ఆ కంత పెద్దదైంది. అవతల వ్యక్తి మొహం బాగా కనబడుతుంది. ఒక పాత 'రంబు' మీద కూర్చుని, సావధానంగా మాట్లాడుకునే అవకాశం కలిగింది. మరికొన్నాళ్ళకి ఆ కంత మరింత పెద్దదయింది. కాస్త పక్కకితిరిగి,

ముడుచుకుని తోసుకొస్తే ఇవతల దొడ్లోకి రావొచ్చు. కొన్నాళ్ళు నాగయ్య దొడ్లో జామచెట్టుకిందా, మరికొన్నాళ్ళు భాస్కరందొడ్లో రంబు పక్కనా కూర్చుని భాస్కరం, సీతారత్నం సాయంత్రం కబుర్లు చెప్పుకుంటూ వుండే వారు. ఎర్ర నాలుక బైటపెట్టి ఆకాశం వెక్కిరించినట్టుగా, సంధ్యచీకటి వారిని చుట్టుముట్టేది. పైన చెట్టుకొమ్మలనడుమ ఒక నక్షత్రం కన్ను మీటేది.

"నీ పెండ్లాం సక్కంది" అంది సీతారత్నం.

"పార్వతేనా?" అన్నాడు భాస్కరం.

"కాక–మరో పెండ్లాన్ని కూడా కట్టుకున్నావా ఏం?"

భాస్కరానికి ఆ కంఠం యిష్టం. కాస్త జీర వుంది – జలుబుచేసి తగ్గినప్పుడూ, తలంటుపోసుకుని, నిద్రనుంచి లేచి నప్పుడూ, వొకరకంగా కంఠం మారడం అతను గమనించాడు. ఆ మాదిరిగా వుంటుంది సీతా రత్నం కంఠం. ఎప్పుడూ. కొన్నిచోట్ల 'చ'కి బదులు 'స' వాడుతుంది. వాక్యం చివరలో 'ఏం' అన్న ప్రశ్న యిముడుస్తుంది – 'కాదా ఏం ?' 'రాదా ఏం ?' 'ఇంతేనా ఏం ?'-లాంటి వాడకం వింతగా వుంటుంది. తన భార్య పార్వతి మాటాడేటప్పుడు, ఇలాంటివి ఏమన్నా వుంటాయేమో నని గమనించడంలో ఒక వింత ఆనందం పొందుతాడు భాస్కరం.

"ఏం తప్పా. అటుకేసి చిత్తూరు, కడప, బళ్ళారి – అక్కడ ఇద్దర్ని ముగ్గుర్ని కట్టుకోడం మామూలే నీకు తెలవదు."

"పోషిం చొద్దా ఏం ? కట్టుకోంగానే సరా. ఏం, పార్వతి బాగుం దిగా"

"కట్టుకున్న వాళ్ళందరూ పెళ్ళాలు బాగలేకనే కట్టుకున్నారా ఏం. అదో సరదా–ఒక మోజు"

సీతారత్నం నవ్వింది.

"పిల్లలు లేకుంటే మరో త్తిని కట్టుకుంటారు కాబోసు. నీకేం-పిల్లలున్నారుగా" అన్నది సీతారత్నం. కాసేపు నిశ్శబ్దం.

"పార్వతమ్మ ఎంత మంచిది!"

"మంచిదేననుకో. ఒక్క మంచితనం చాల్తుందా ?"

"ఏం, సక్కందేగా. ఊరోళ్లు సాలాసక్కందని సెప్పు కుంటారంట. ఆ చలమయ్య చెప్పాడు. మా నాగయ్య ఒకటే నవ్వు".

"ఎందుకో"

"అందరికీ తెల్సిన విషయం సెప్తాడేంటా అని—"

"ఓ, అదా"

ఇద్దరూ నవ్వుతున్నారు.

ఇంతలోకే దొడ్లోకొచ్చింది పార్వతమ్మ. గోడ కంతలోంచి వారిద్దరూ మాట్లాడుకోవటం చూసింది. ఆమెను వారూ చూశారు.

"నీ మాటే చెప్తోంది—సీతారత్నం" అన్నాడు భాస్కరం, భార్యని సంబోధిస్తూ.

"ఏం కథ— చీకట్లో నేల బాగాలేదు. పురుగూ పుట్రా లాంతరు తెచ్చేదా ?" అంది పార్వతి.

"నువ్వు సక్కందానివని ఊళ్ళో చెప్పుకుంటారంట. చలమయ్య చెప్తాడు" అంది సీతారత్నం.

"చలమయ్యకి నోటి దురద జాస్తిలె. తెస్తా—" అని లోపలికెళ్ళింది పార్వతి.

"ఇదిగో, ఇటుచూడు. చక్కందని దానికి తెలిస్తే చిక్కు. నేను లొక్కవుతాను, ఇంకెప్పుడూ అనమోక—"

"నిజం సెప్పకుండా వుండలేనుగా నీకు తెలీదా ఏం ?"

రెండు మూడేళ్ళలలో వారి అన్యోన్యం ప్రబలింది. వేర్వేరు యిళ్ళయినా, ఒక కుటుంబంలో వారిలాగే మెలగ సాగారు. భాస్కరం

అమాయకత్వం, మతిమరపు, వె(ర్రి ఊహలు భార్య చెప్తుంటే విని, నాగయ్య విరగబడి నవ్వేవాడు. నాగయ్య వ్యవహార దక్షత, లౌకిక విషయాల పట్ల శ్రద్ధ, ఖర్చ చెప్తుండగా విని, పార్వతి మెచ్చుకునేది. ఆ నలుగురూ వొకర్ని వొకరు, హేళన చేసుకొనేవారు; మాటలతో దెప్పి పొడుస్తుండే వారు; వెక్కిరించుకునేవారు నలుగురూ. ఏదో సమయంలో కలిసి కబుర్లు చెప్పుకోకుండా ఏ రోజూ గడిచేది కాదు. ఒకరింటికి బంధువులు, స్నేహితులు వస్తే, రెండోవారు ఆ వచ్చినవారికి సదుపాయాలు సమకూర్చేవారు. వంట పదార్థాలు ఇచ్చిపుచ్చుకోడాలు, చేబదుళ్ళు పొలం వ్యవహారంలో సహాయపడ్డం— యివన్నీ జరుగుతూ వచ్చాయి.

పార్వతికి ఏడో మాసం— "కాన్పుకి పుట్టింటికి వెళ్ళ నక్కర్లేదు. పురుడు నేనే పోస్తా"నంది. సీతారత్నం— ఆనాటి సంభాషణ, భాస్కరం ఇంట్లో మండువా గదిలో పార్వతి పేరంటాని కెళ్ళింది.

"ఆళ్ళ ఊరు వెళ్ళడం దేనికేం- మేం అంతా లేమా ఏం ?" అంది సీతారత్నం.

"దానికి అక్కడే పోసుకోవాల నుంది. అమ్మా, నాన్నా దగ్గరుంటే ప్రాణం కుదుటపడ:తుందిట. దానిష్ట ప్రకారం చెయ్యవల్సినవాణ్నేగా" అన్నాడు భాస్కరం.

"నువ్వు కానా మంచి మొగుడువేగా. నాగయ్యలాగ పీకులాట మనిషివి కావులే" అంది సీతారత్నం.

"అట్లా గుండటం- నీ ముంగలే ననుకో రత్నం-" అన్నాడు. రత్నం అని సంబోధించడం అదే మొదటి మారయినట్లు ఆమె ఆశ్చర్యం ప్రకటించలేదు.

"నాకు తెలువదా ఏం, భాస్కరం ?"

"తెలిస్తే, ఎప్పుడూ చెప్పలేదేం ?"

"ఏముంది సెపానికి ?"

'సెప్తానికి' అనేవిధం, అతని కిష్టం. సీతారత్నం కేసి పరీక్షగా చూస్తున్నాడు- పరాయి దేశం స్త్రీ కేసి చూస్తూనట్లు. ఆమెది మధ్య పాపిడి- ముక్కుకి తిన్నగా, స్కేలు పెట్టి కొలిచినట్లు- మధ్యగా పాపిడి తీసి, జుత్తుని కిందికి బిగించి లాగి, జడగా అల్లి కొప్పుగా బిగిస్తుంది. ఆ పాపిడి కాస్తంత పక్కకుంటే, కాసిని వెంట్రుకలు, ఆ చెవుల మీద కమ్మితే బాగుంటుంది కదూ. కాని ఆ మాట పైకి అనలేదు భాస్కరం. ఆమెది పెద్ద బొట్టూ- రూపాయి- బిళ్ళంత. చెవులకి బుట్టలా వ్రేలాడే జూకాలు, మెడనిండా మూడు గొలుసులు, జిగిణీ నల్లపూసలు, బంగారు తొడుగు పగడాల ఆ గొలుసు బరువు రాపిడీ మెడమీద గీతలు పడ్డాయి.

ఏడు గజాల గళ్ళ చీర, చుట్టలు వేసి, పొత్తి కడుపు మీద అరటిపండులా మడిచి బిగించి ధరించింది. బిగుతుముడి చుక్కల రవిక; ఆ ముడి విప్పడం ఆమెకి సాధ్యపడుతుందా ? పార్వతి రవికా అట్లాంటిదే. ఆమె బొత్తాములు, పిన్నులు వాడుతుంది. స్త్రీల వేష ధారణ చిత్రంగా తోస్తుంది భాస్కరంకి. వయస్సుతో తనకంటె సీతారత్నం ఐదారు నెలలు పెద్ద. కాని ఆ విషయము మర్చిపోతాడు భాస్కరం.

"పార్వతి లేకుంటే తోచదు- నీకు దిగులు- కాదా ఏం ?"

"అవు ననుకో; అదోరకం దిగులు. నువ్వంటే నాకేదిగులూ వుండ దనుకో"

"ఇ దేరకందో ?"

"ఇది అదో రకందిలే"

కాసేపు ఎవ్వరూ మాటాడలేదు. అతను బెంచి మీద నుండి లేచి, ఆమె కూర్చున్న చాప మీద కూర్చున్నాడు. అందెలు, మట్టెలతో

బరువుగా కనబడుతున్న పాదాలమీదకి చీర మడతలు లాగి, వెనక్కి జరి గింది సీతారత్నం.

"మరిచాశ్మా రత్నం !" అని నిట్టూర్చాడు భాస్కరం.

"పార్వతి మతిమరుపు బాగా నేర్పింది నీకు. కావల్సిన వన్నీ సేసిపెడుతుంది. మారాజు బిడ్డ. మరి మరుపు లేకుండా పోతుందా ఏం ? అయినా, ఏమిటి మరిశా ?"

"పార్వతిని మరిచా... అవును— నాగయ్యనీ."

"ముందుముందు నన్ను మరుస్తావా ? ఎప్పుడూ నీ ఎదురుంగా వుండాలి నేను కాదా ఏం ?" కనురెప్పలు దించేసింది సీతారత్నం. ఆమె కళ్ళకి కొంటెతనం ప్రకటించే అమరిక వుంది. ఆమె మాటలు వింటూ, ఆమె భావప్రకటన గమనించడానికి అలవాటు పడుతున్నాడు భాస్కరం.

"నీకు మాత్రం అట్లా వుండదా ?"

సమాధానం చెప్పదు. నవ్వుతుంది.

"ఏం, నేనంటే వేళాకోళమా ?"

కాస్త ముందుకి జరిగాడు.

"మీదిమీది కొస్తావేం, పాడుపిల్లడ" అని చివాలున లేచి, మెళ్ళో నగలు, వడ్డాణం సర్దుకుంది సీతారత్నం. ఒక్క గంతుతో దొడ్డివైపుకి నడిచింది. నగల ధ్వనిలో కూడా ఒక క్రమం, లయ వున్నట్లనిపించింది అతనికి.

ప్రతిరోజూ కలుసుకుని అట్లా మాట్లాడుకుంటారు. ఒక్కొక్క సారి అది వీలుపడకపోయినా చూసుకునేనా తృప్తిపడేవారు. ఈ రోజైపోయింది — రేపు, మరోసారి వొకర్ని వొకరు చూసుకుంటాం కదా అన్న తలంపుతో ఆ రాత్రికి కన్ను మూస్తారు. నలుగురూ వున్నప్పుడు, చూపులతో మాట్లాడుకుంటారు. ఆమె నవ్వినప్పుడూ, మూతి వంకరై

పెదాల చివర పళ్ళమీద ఎర్రచిగుళ్ళు తళుక్కుమన్నప్పుడూ తనకేదో గొప్ప సందేశం యిచ్చినట్లు భావించేవాడు.

"మెడమీద – అదుగో అక్కడే ఆ చెవికింద ఆ మచ్చేమిటి ?"

"సిన్నప్పుడు, అటకమీదనుంచి మావయ్య తోస్తే పడ్డాగా."

ఇట్లాగ ముందువెనుక, సందర్భం లేకుండా, కంతులిచ్చుకున్నట్లు. ఒక్క నిమిషం సంభాషించుకునే సందర్భాలూ వుండేవి. పై వూళ్ళో టెంట్ సర్కస్ ఒకటొచ్చింది – నాలుగైదు మైళ్ళు. పార్వతి లేదు – పురిటికి పుట్టింటికెళ్ళింది. ఆ ముగ్గురూ, స్నేహితుడు చలమయ్య – అందరూ కలిసి రెండెడ్ల బండిమీద ప్రయాణమయ్యారు. సర్కస్ చూచి రాత్రి పదింటికి ఇంటికి బయలుదేరాడు. బండిలో కునికిపాట్లు పడుతున్నారు. బండివాడి కేకలు, ఎడ్ల మువ్వలు, బయట కీచురాళ్ళ నాదం వినబడుతున్నాయి. బండి ఏదో గాట్లో పడింది. భాస్కరం ముందుకి – సీతారత్నం వైపు వొరిగాడు. ఆమె త్రుళ్ళిపడి, భాస్కరం చెయ్యి పట్టుకుంది. అదొక వింత స్పర్శ – పదిక్షణాలు. మళ్ళా దూరంగా జరిగి సర్దుకున్నారు.

ఆ పది క్షణాల స్పర్శవల్ల వారి అన్యోన్యం పెరిగింది. కాని ఆ మర్నాడు, తరువాత నాలుగైదు రోజులవరకూ, వారు సిగ్గుపడి, కలుసుకుని మాట్లాడుకోలేకపోయ్యారు – దూరంగా ఓ క్షణం, ఒకర్నొకరు చూసుకుని, ఏదో తప్పిదం చేసినవారికిమల్లే చూపు తప్పించి క్షమాపణ చెప్పుకున్నట్లు మసలేవారు. ఓ వారం జరిగాక తమింటికొచ్చి భోజనం చెయ్యవలసిందిగా, నాగయ్య కబురెట్టాడు. భాస్కరం రానన్నాడు – ఒకటి రెండు రోజులు తినొచ్చుగాని, నెలలు తరబడి అక్కడకొచ్చి తినడం భావ్యంకాదన్నాడు. సీతారత్నం వండి అతనింటికి పంపించేది.

సీతారత్నం గర్భవతి అయింది. ఐదోమాసం చూడాలనుంది ఒకసారి కనిపించమని భాస్కరానికి పసిపిల్ల చేత కబురంపింది. నాగయ్య

పొలంనుండి ఇంకా రాలేదు. సాయంత్రం ఆరైంది – మండువా గదిలో పరుంది. గోడమీద ఉడతల జంట పరుగులెడుతోంది. భోషాణం పక్క పంజరంలో రామచిలక ఏదో వాగుతోంది – పనిపిల్ల లాంతరు చిమ్నీ తుడుస్తోంది.

“ఏం పడుకున్నావే?” అన్నాడు భాస్కరం. ట్వీల్లుహాఫారం – కంటిమెడది; ధోవతి, పైన తువ్వాలు వేసుకున్నాడు, చామనఛాయ, స్ఫుటమైన ముక్కు, నుదిటిమీద ఒంపుతిరిగిన చోటు, రెండు గీట్లు, క్రమమైన పళ్ళ వరస - అక్కడక్కడ తాంబూలం డాగులున్నా, చిన్న మీసం, మధ్య పాపిడి – ఒంకులు తిరగక, సాఫీగా మొహాన అటూ ఇటూ జారిన క్రాపింగు.

“నిజమేట – వైద్యుడు చెప్పాడు.” అన్నది సీతారత్నం. లోపలున్న కుర్చీ లాక్కొచ్చి, మంచం ప్రక్కనే వేసి కూర్చున్నాడు భాస్కరం.

“విన్నా.”

ఆమె సిగ్గుతో మొహం పక్కకి తిప్పేసింది.

“ఆడదానికి ఇటాంటప్పుడు ఎయ్యో మనసులు పుడతాయి గాదా ఏం?”

“అవునవును.”

“పార్వతిని సూడాలనుంది. తోసదంలా. వెంటనే రమ్మని మజాబూలిగా రాయి.”

“మజామూ తంటే?”

“తెల్దా ఏం–గట్టిగా అన్నమాట.”

“ఓ.”

“మరోటి. సర్కసులో ఖపూనోళ్ని చూస్తిమే – అడిహూదిరి మీసం తగిలించి కనబడరాదా ఏం?”

నవ్వుతున్నాడు. అదేం కోరిక?

రత్నం అదోకలా గుంది. మొహం విప్పారుకున్నట్లు కాస్తంత పెద్దదయినట్లు – మంచి దబ్బపండులా... యింతలోనే వచ్చాడు నాగయ్య – మొహానికి మీసాలు, ఎర్ర కోతిముక్కు, మూతిచుట్టూ తెల్ల రంగూ చిత్రాలుగల అట్టని తగల్చుకుని.

"బూచ్ అన్నాడు నాగయ్య.

"అదేం ఏషం?" అని అడిగింది.

"ఆనాడు సర్కస్‌లో చూసిన బఫూనోడి వేషం. గురవయ్యగారి తమ్ముడు తయారుచేశాడు ఈ అట్టని" అని అట్ట తొలిగించాడు.

"ఇహనేం – ఒక మనసు తీరిందిగా" అన్నాడు భాస్కరం.

"ఆ అట్ట నీ మొహానికి తగిలించుకో" అంది రత్నం.

భాస్కరం అట్టని తన మొహానికి తగిలించుకుని సర్కసులో బఫూన్‌లాగా గంతులు వేస్తున్నాడు. నాగయ్య, రత్నం నవ్వుకుంటు న్నారు. పనిపిల్ల దీపం వెలిగించింది.

తనకి తోలుబొమ్మలాట చూడాలనుంది. అంది సీతారత్నం భర్తతో.

'అయత్తు పరుస్తాలే' అన్నాడు నాగయ్య. ఆ రాత్రి అక్కడే భోజనం చేశాడు భాస్కరం. తనింటి కెళ్ళి పరున్నాడు.

నాలుగోనాడు ఏర్పాటు చేశారు తోలుబొమ్మలాట. పందిరి ముందు స్తంభాలకు తెర కట్టారు. వెనక కాగడాలు వెలిగించారు. బొమ్మల నీడలు తెరమీద పడుతున్నాయి. ఊళ్ళో జనం– ఆడా మగా, పిన్నా పెద్దా మూడొందల మంది మూగారు. రావిచెట్టు కింద, ఇంటి చూరుల కింద కూర్చున్నారు. మధ్య మధ్య గాడిదలు నిలబడి నిద్రపోతున్నాయి. అక్క డక్కడ కిటికీలోంచి లాంతర్లు సన్నగా వెలుగుతున్నాయి. రావిచెట్టు ఆకులు గాలికి రెపరెప లాడుతున్నాయి. ఆకాశంలో పల్చటి చందమామ ప్రసవించిన స్త్రీ మంచం మీద నుండి లేచినట్టు– మేఘం పొరలోంచి

లేస్తోంది. సీతారత్నం వినోదిస్తుంది. జుట్టు పోలిగాడు వచ్చినప్పుడల్లా విరగబడి నవ్వుతోంది. తన సంతోషాన్ని తెలియజరుస్తూ మధ్య మధ్య భాస్కరం కేసి చూస్తోంది. అతను రావిచెట్టు ప్రక్క దిమ్మమీద చాపేసుకుని, మరో దిమ్మకి జార్లబడి చూస్తున్నాడు నాగయ్య ఎదురిల్లు అరుగుమీద పడుకుని చూస్తున్నాడు. అప్పుడప్పుడు లేచికూర్చుని ఆవులించి, మళ్ళీ పండుకుంటున్నాడు.

తెరమీద పోతురాజు, బంగారక్క వాదించుకునే ఘట్టం సాగుతోంది. రావిచెట్టు మీద పిట్టలు, కూస్తూ చెలరేగాయి. సీతారత్నం అటు కేసి చూచింది. దిమ్మమీద భాస్కరం లేడు. అక్కడ జనం పల్చబడ్డారు? పై నుండి పిట్ట రెట్టలు భరించలేక జనం మరోచోటికి తొలుగుతున్నారు. పక్కింటి అరుగు మీద జనం ఒక గుంపుగా లేచి, రోడ్డు మీద నడుచుకుంటూ పోతున్నారు. ఆ చూరుకింద భర్త నాగయ్య కూడా లేడు. ఆట నిలచిపోయింది. జనం అటూ ఇటూ వెడుతున్నారు. ఇదంతా ఏమిటని అడిగింది సీతారత్నం. తిమ్మడు పొలంకాడ గుడిసెలు, గడ్డివాములు తగులడ్డాయట ఆర్పడానికి వెడుతున్నా రన్నా రెవరో. భాస్కరం కూడా అక్కడికే వెళ్ళాడా ? గబ గబ దొడ్లోంచి గోడ కంతలోంచి భాస్కరం ఇంటికెళ్ళింది సీతారత్నం. మండువాలో మంచం మీద నిద్రపోతున్నాడు భాస్కరం- ఆకాశంలో మబ్బులు దుప్పటిలా కప్పాయి చందమామని. చీకటిగా వుంది. లోపల గదిలో గాలికి లాంతరు ఊగిసలాడుతోంది. వొత్తి పెద్దది చేసింది. భాస్కరం మసగ్గా కనబడుతున్నాడు. మొహం నవ్వుతున్నట్లుగా వుంది. ఒక కంటిమీద రెప్ప పూర్తిగా వాలలేదు. శ్వాస బలంగా వినబడుతోంది. వేలుతో అతని కంటిమీదికి రెప్పను దించింది. అతను లేవలేదు. మంచం ప్రక్కనే కింద కూర్చుని అతనికేసి పరీక్షగా చూసింది. గాఢనిద్రలో వున్నాడు. లేపడం ఎందుకేం అనుకుంది. ఆమె కళ్ళంట నీళ్ళు తిరిగాయి అప్రయత్నంగా. తుడిచేసుకుంది- గాలి పెద్ద

దైంది. లాంతరు ఆరిపోయింది. దిండుకింద వున్న దుప్పటిని లాగి, దులిపి, అతని మీద కప్పింది.

'ఖండనిద్ర' అంది పైకి వినబడేటట్లు. అగ్గిపెట్టి కోసం అటూ, ఇటూ చూసింది కనబడలేదు. దొడ్డిదాటి యింటి కొచ్చేసింది. పెద్ద గాలీ, వర్షం ప్రారంభమైంది. తోలు బొమ్మల వాళ్ళు తెర మడిచేసి, సామానులు చూరు కిందకి జేరవేశారు. గాడిదలు నిద్రపోతూనే వున్నాయి. జనం తిరిగి వచ్చేస్తున్నారు.

"మనం ఆర్పేదేమిటి- భగవంతుడే ఆర్పేశాడు మంటల్ని— ఏం లేదు. గడ్డివాము- సూరపరాజు గొడ్లపాకాను—" అన్నాడు నాగయ్య.

భాస్కరం తడుస్తాడేమో- లోపల పండుకోమని చెప్పరాదా ఏం ?" అంది రత్నం.

నాగయ్య వెళ్ళాడు 'అవునుస్మా' అనుకుంటూ.

ఐదారు మాసాలు గడిచాక, పుట్టింటి నుంచి తిరిగొచ్చింది సీతారత్నం మొగపిల్ల వాణ్ని ఎత్తుకొని. ఆడపిల్ల నెత్తుకొని పార్వతమ్మ రెండు నెలల క్రితమే వచ్చింది. కొన్నాళ్ళకి ఆ పిల్లకి 'అలివేణి' అన్న పేరెట్టారు. సీతారత్నం కొడుక్కి 'సంగయ్య' అన్న పేరెట్టారు.

ఆ రోజు శుక్రవారం. భాస్కరం క్రాపింగ్ కత్తిరిస్తున్నాడు మంగలి. అద్దం చేతులో పెట్టుకొని చూస్తుంటే, సీతారత్నం తలంటు పోసుకొని జుట్టు ఆరబెట్టుకుంటున్న దృశ్యం కనబడుతోంది అందులో. చెవుల మీదికి వెంద్రుకలు జారాయి. అలా చెవులని కప్పిన జుట్టంటే భాస్కరానికి యిష్టం. ముందుకు తిరిగి దొడ్లో తిరుగుతున్న సీతారత్నం కేసి చూస్తూ కూర్చున్నాడు. ఇంకా మెడ నిండా నగలు అమర్చుకోలేదు. రెవిక కూడా తొడుక్కున్నట్లు లేదు. భుజాల వొంపు, స్తనాల ఎత్తు పిరుదుల గుండ్రదనం ఇవన్నీ వింతగా కనిపిస్తున్నాయి. ఆమె మరొక మనిషిలా కనబడుతోంది.

పార్వతీ అలాగే వుంటుందా ? తాను యూసారేనా పరీక్షగా

చూడాలి. స్నానం చేసి, బయట ఖాళీ స్థలంలో వేస్తున్న పాకవైపు కొచ్చాడు. దాన్నిండా నాగళ్ళు, బస్తాలు ఇటుకల గుట్టలు, పిడకలు, కట్టెలు వున్నాయి. ఒక మూలగా పాత నులక మంచం ఒకటుంది. దానిమీద కూర్చున్నాడు. కొత్తగా వేస్తున్న పాక పాత గోడని అనుకుని వుంది— నాగయ్యగారి పనిపిల్ల. అమ్మగారు రమ్మంటున్నారని కబురు తెచ్చింది— భాస్కరం వెళ్ళాడు.

పిల్లాడు సంగయ్య ఉయ్యాలతొట్టిలో వున్నాడు. కుర్రాడు ఊపుతున్నాడు. నాగయ్య ఊళ్ళో కెళ్ళాడు. సీతారత్నం మంచంబద్దీ మీద కూర్చుని వుంది. మెడలో రెండు మూడు గొలుసు లున్నాయి, రవికతొడుక్కుంది. చెవులకి మాత్రం ఇంకా గొడుగుతోలకులు తగుల్చుకోలేదు. జుట్టు మెలితిప్పి సగం తవాలుతో బిగించి వెనక్కి తిప్పి కట్టింది. నుదిటి మీద వ్రేలాడే చిరు వెంట్రుకలు లేవు. నవ్వుతోంది.

"సూడాలనిపించింది- నీకు- నాకూ అంతే కబురంపా-"

అతనికి ఏమనాలో తెలీదు.

"తలంటుపోసుకొంటే జులాయిస్తుందిలే."

"అంటే ? !

"మైకంగా వుంటుందనుకో"

"ఎక్కడిదీ మాట ! పుట్టింటి నుంచి వొచ్చాక, ఏవో కొత్త కొత్త మాటలు వాడుతున్నావ్" అన్నాడు భాస్కరం.

"అక్కడ మా ఊళ్ళో మాటలు అట్లాగే వుంటాయి. దానిప్పగారు భలే కబుర్లు సెప్తుండాడు.

అతను నిలబడే వున్నాడు.

"యెండగొట్టబడి నట్లుండావు — ఇలా ఆసోదా వేసుకో"
అంటూ చాపేసి, దానిమీద కంబళీవేసి, కూర్చోమని సంజ్ఞచేసింది. తనూ కూర్చుంది కంబళీమీద — మూలగా జరిగి డబ్బాలలోంచి తినేసరుకులు తీసింది.

"డబ్బా మీ పసివాళ్ళకి — పార్వతికి మిటాయి కొమ్మంటే భలే ఇష్టం."

"ఈ పూట చాలా సన్నగా చూపుతున్నావేం ?"

"అంటే ?"

"'దర్శ' అన్నమాట," అన్నాడు.

"నువ్వుకూడా కొత్త మాటలు వాడుతున్నావు కదా ఏం ?"

ఇద్దరూ నవ్వి, మౌనంగా వున్నారు.

"సెప్పనా, చిత్రం ఇదివరకు మాదిరి కాదు. ఏదో మారిపొయ్యాను. ఈ మధ్య నిన్ను గురించి ఆలోచించడమేలేదు. సూస్తే సూడాలనిపిస్తే - వెంటనే వొచ్చి సూడ్డమో, కబురుపెట్టి సూడ్డమో జరగాల్సిందే — నీకూ అంతేనా ?"

"అవును, ఇందాక తలంటుపోసుకొని జుట్టు ఆరబెట్టు కుంటున్నావుగా. అప్పుడు సూడాలనిపించింది."

"చూస్తివా. ఇట్టె గ్రహించా. అందుకనే కబురెట్టా పార్వతిని కూడా తీసుకురాలేకపొయ్యావా ?"

"పని చేసుకొంటోందిగా."

ఆమె లేచి వుయ్యాలతొట్టిలో పిల్లవాణ్ని ఎత్తుకుంది.

"అచ్చంగా నాగయ్య పోలిక కాదా ఏం ?"

"అవునవును. అచ్చంగా నాన్నే."

"కాసేపు ఎత్తుకు ఆడించు." అని పిల్లవాణ్ని అందించింది. తీసుకోవటంలో ఆతని చేతులు ఆమె స్థనాలకు తగిలాయి. సిగ్గుపడి తల పక్కకి తిప్పేశాడు. పిల్లవాణ్ని వదిలేశాడు. ఆమె తొడమీద ఆనింది బిడ్డ. కాళ్ళు నేలకి తగిలి. పిల్లవాడు ఏడుస్తున్నాడు.

"మంచివాడివే - ముగ్గురు బిడ్డల తండ్రివి — ఆడించటం చేత కాదా ఏం ?"

ఆమె తొడమీద వున్న పిల్లవాణ్ని స్పర్శించి సముదాయిస్తున్నాడు.

ఆ క్షణంలో గతాన్ని మరచినవాడివలె, జిజ్ఞాస తప్పి ఆమె తొడ మీద తన తలను ఆనించి. మొహాన్ని చీరమడతల్లో దాచుకొన్నాడు. తొడ వెనక్కు లాగి, తన చేతులతో అతని ముఖాన్ని పైకెత్తి, కళ్ళలోకి చూసింది.

అతని కళ్ళ నీళ్ళు, ఆమె కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

"వొంట్లో బాగాలేదా ఏం ?"

అతనేమీ మాటాడలేదు.

కొంగుతో తన కళ్ళు తుడుచుకొంది సీతారత్నం. ఒకటి రెండు కన్నీటి చుక్కలు, వొడిలో పిల్లవాడిమీద పడ్డాయి.

"ఎందుకు — నీ కళ్ళు అట్లాగున్నా ఏం ?"

"నీ వెందు కున్నాయి ?"

"ఏమో !"

"నాకూ తెలవదు."

"ఇంక ఇట్లా ఎప్పుడూ జరుగకూడదు. అవునా ? అన్నాడు.

"టీకా వేసుకొందాం, జరుగలేదుగా-ముందూ జరుగడు. ఏం ?" అంది సీతారత్నం.

అదొకలాగయింది. మొగాడు ఏడవటం యేమిటి ?" అన్నాడు.

"పార్వతి ముంగల ఈ మాదిరి చేస్తివా ?"

"ఇలా చూసుకొంటూ కూర్చుంటే బాగుంటుందనుకో."

"నాకు తెలీదా యేం ? సూడకుంటే, ఒక్క రోజు గడవదుగా."

"మరి పుట్టింటి కెళ్ళినప్పుడు ?" అని అడిగాడు.

"ఇప్పుడొచ్చి సూస్తే ఎంత బాగుండును అని అనిపించేది. పైకనగూడదుగా. నా కెలా గనిపిస్తూందంటే — పార్వతీ, చెరొకపక్కా కూకుండి, మధ్యనే పండుకొని, ఇద్దరి కళ్ళలోకి చూస్తూ కుడికంటితో ఎడమపక్క నున్నవోరిని, ఎడంకంటితో కుడిపక్క నున్న వారినీ, కన్నుసిట్లించి నవ్వించి, యేడ్పించటం అనుకో," అమాయకంగా నవ్వుతోంది. భాస్కరం పసివాడిలాగ నవ్వుతున్నాడు.

"నా కట్టాగ వుండదుస్మా — అటుపక్క నాగయ్యా, ఇటుపక్క నువ్వు కూర్చునివుండగా మధ్యనే పడుకొనుండను"

"అనుకోకూడదనుకో - జొరమొస్తే ఏం చేస్తావు – నేనూ నాగయ్యా చెరొకపక్కా కాళ్ళకాడ పార్వతి ..."

"ఏమో – నాకు ఒంటిగా. ఏ తోటలోనో కాలవడ్డున ఏ పాకలోనో ఆవులకేసీ, పశులకేసీ చూస్తూ కూర్చోవాలనుంటుంది - మనిద్దరం.

"మరి నాగయ్యో ? పార్వతి వద్దా ఏం ?"

"వాళ్ళూ వుంటారు. ఏమిటో నా కంతా గందరగోళంగా వుంది పోదూ" అన్నాడు భాస్కరం.

"నాకూ-బేబంధు నలుగురు వుండగా ఇడిగా వుండాలనుంటుంది – ఇడిగా వుంటే నలుగురూ వుండాలనిపిస్తూంది. యేమిటో చిత్రం."

మళ్ళా మౌనం – గులాబీలోకి ఎరుపురంగు చల్లగా జారిన నిశ్శబ్దం.

"మనకి మొదట్లో ఎప్పుడు కల్సిందంటూ ఈ స్నేహం నీకు జ్ఞాపకం వుందా ?"

"లేదు, నేనా విషయం ఆలోచించనేలేదు. మనం ఎప్పుడూ ఇలాగే వున్నాం"

"నాకూ గుర్తులేదు, మొదట్లో గోడ కంతలోంచి అదొకలా చూసే వాడివి – అవున్నా ?"

"జామిచెట్టుకింద కూర్చుని, నవ్వేదానివి కావా ఏం ?"

"ఒకటి సెప్పనా, తోలుబొమ్మలాడినారే – ఆ రేత్రి గుడిసెలు తగులపడ్డాయని పెద్దోళ్ళు వూళ్ళో కెళ్ళారు. నువ్వు పండుకున్నావు. ఎట్లా గున్నావో చూద్దామనొచ్చి లాంతరు పెద్దదిచేసి చూశా– గుర్రట్టి నిద్ర పోతుంటే, లేపకుండా, దుప్పటి కప్పి వొచ్చేశా. నీకు సెప్పలా. ఆ రాత్రి కళ్ళంట నీళ్ళు తిరిగినై."

భాస్కరం లేచాడు, బైటికి నడిచి వెళ్ళాడు, పిల్లకోసం ఆమె యిచ్చిన మిఠాయికొమ్ముల డబ్బా తీసుకుని.

అట్లాగ, ఏడెనిమిదేళ్ళు గడిచాయి. ఒడ్డు కోయకుండా, వొడు

దుడుకు లేకుండా, సాఫీగా సాగిపొయ్యే రెండు పిల్ల నదులల్లే గడిచాయి వారి జీవితాలు. జలపాతాలూ, వరదలూ, ఎండిపోవటాలూ లేవు. ఉప్పొంగి వొడ్డుని చీల్చటం లేదు. ఒడ్డున పాతిన చెట్లు పెద్దవై నీడల్ని ప్రసరించి నట్లు ఇరువురికీ సంతానం కలుగుతూ వచ్చారు. భాస్కరానికి ఆరుగురు- ముగ్గురు మొగపిల్లలు, ముగ్గురాడపిల్లలు, వొక పిల్లవాడు పోయాడు. ఇప్పుడు ఐదుగురు. సీతారత్నం సంతానం ఏడుగురు – ఇద్దరాడపిల్లలు, ముగ్గురు మొగపిల్లలు. పిల్లలు బండ్ల మీద, మూడుమైళ్ళ దూరంలో వున్న స్కూలుకెడతారు– అక్కడే భోజనాలుచేసి, ఆటలూ అవీ అయ్యాక మళ్ళా బండ్లమీద ఇంటికొస్తారు. కొన్నిరోజులు నాగయ్య, కొన్నిరోజులు భాస్కరం, పిల్లల్ని కూర్చోబెట్టి చదివిస్తారు.

రెండేళ్ళక్రితం, గ్రెగ్ కలెక్టర్‌గారి ధర్మమా అంటూ మైలు దూరంలో, రెండు గ్రామాలకి మధ్య కొత్తస్కూలు అవతరించింది. గ్రెగ్ కలెక్టర్‌ను గురించి ఎన్నో కథలు చెప్పుకుంటారు. ఆయన విడిదిచేసిన చోటికి ఊరిపెద్దలు ఆయన దర్శనానికొస్తే, వారిమీదికి ఆయన కుక్కని వదిలేవాడట. అది, ఏమనిషి దగ్గరకెళ్ళి, తోకాడిస్తూ నిలబడుతుందో, ఆ మనిషిని దగ్గరకు రప్పించి పరామర్శించేవాడుట. పెద్ద మనుషుల్ని ఇట్టె పసికట్టేస్తుందిట ఆ కుక్క. స్కూలు కట్టించడంకూడా తమాషాగా జరి పాడుట. రెండు ఊళ్ళవాళ్ళూ, ఆ పని తమదికాదని వూరుకుంటే, ఒక ఊరివారి దగ్గర డబ్బు వసూలుచేసి, రెండో ఊరివారికి ఆ డబ్బుతో భవనం కట్టేపని వప్పగించి, నాలుగు నెలల్లో స్కూలు పూర్తి చేయించాడు. అది ఆ రెండు ఊళ్ళకి మధ్యలో కట్టారు.

సత్ప్రవర్తనచే, పేరూ ప్రతిష్ఠా గడించుకుని, ఊళ్ళో చిన్న చిన్న తగవులను, కోర్టుల కెళ్ళనీయకుండా పరిష్కారం చేస్తూ, పెద్దమనిషిగా ఎవర్ని నలుగురూ నిర్ణయిస్తారో, ఆ వ్యక్తికి ఒక బంగారు పతకం బహూకరించి గౌరవించేవాడుట గ్రెగ్. ఆ పతకం పొంది నాయన్ని,

మూడేళ్ళపాటు, పాఠశాలలో ఉపాధ్యాయుడుగా నియమించే వాడుట. అట్లాంటి వ్యక్తిని గ్రెగ్ మెడలు విరిచిన పెద్దమనిషని వ్యవహరిస్తూండే వారుట.

ఆ సంవత్సరం, ఆ గ్రెగ్ బంగారుపతకం చలమయ్యే కొచ్చిందని వినగానే నాగయ్యా, భాస్కరం, ఆశ్చర్యపడ్డారు. వారిద్దరూ చలమయ్యని బాగా ఎరుగుదురు ఓ విధంగా వారికి స్నేహితుడుకూడా. చిల్లర పనులు చేసి పెడుతూంటాడు. ప్రొద్దుపోయి, పిల్లలింకా స్కూలునుంచి రాకపోతే, అతను వెళ్ళి తీసుకొస్తూ ఉండేవాడు. కథలూ, కార్యాలూ వస్తే, సరుకులు చేరవేసి ఆదుకునేవాడు. నిజమే; కాని మాటలపోగు. ఇక్కడి మాట అక్కడా, అక్కడి మాట ఇక్కడా చెప్పి స్పర్థలు పెంచేవాడు – తగవులు సర్దుబాటు చేసే పెద్దమనిషిగా చలామణీ అయి, యీ పతకం తెచ్చుకొని, మూడేళ్ళపాటు పిల్లలకి పాఠాలు బోధించే పరిస్థితి ఏర్పడినందుకు కాస్తంత నొచ్చుకున్నా, పైకి చెప్పే ధైర్యం వారిద్దరికీ లేదు.

ఆనాడు పూర్ణిమ. రాత్రి తొమ్మిదైంది. చిన్నపిల్లలు పడుకున్నారు. నాగయ్యా, పెద్ద పిల్లలూ, పార్వతీ రంగన్నగారి తమ్ముడూ పెండ్లి కెళ్ళారు. పెండ్లయింది. రాత్రి హరికథా, మేజువాణీ, భాస్కరం వెళ్ళలేదు దొడ్లో గోడ పక్కన కొబ్బరిచెట్ల కింద బెంచిమీద పడుకుండి ఆకాశంలోకి చూస్తున్నాడు.

"నువ్వెళ్ళలేదేం మేజువాణికి !"

ఉలిక్కిపడి లేచాడు భాస్కరం. సీతారత్నం తెల్ల చీర, కొప్పులో మల్లెపూలు–చేతి గాజులు వెన్నెట్లో మెరుస్తున్నాయి.

"రా, రా."

బెంచి పక్కనున్న మంచం ముందుకు లాక్కుని కూర్చుంది.

"ఊరికే తలనొప్పి."

"గంధం పట్టీ వేసేదా ?"

"నువ్వే వొస్తివిగా, వేరే పట్టీ ఎందుకేం?"

"ఒయబ్బ"

"తాకకూడ దనుకున్నాం గాని, లేకుంటే చేతులో చెయ్యి వెయ్యేనూ."

"ఇంద – ఏదీ – చెయ్యి." అని చెయ్యి చాచింది

అతను చెయ్యి పైకి తీశాడు.

"అమ్మా!" అని చేతిని వెనక్కి లాక్కుంది.

ఈ ఏడెనిమిదేళ్ళల్లోనూ వారిలో కొన్ని మార్పులొచ్చాయి. సీతారత్నం కంఠం కాస్త స్థాయి పెరిగింది. తల్లో అక్కడక్కడ తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. రవిక ముడేసి బిగించడం బదులు, బొత్తాములున్న రవిక ధరిస్తోంది. చేతులు జబ్బలమీద కుంటాయి. రవిక మెడ కాస్తంత కిందికి దిగింది. లోలాకులుపోయి దుద్దులు, బొట్టు సైజు తగ్గింది. తల్లో పిన్నులు, చీర ఏడు గజార్ది, కథా కార్యం వుంటే తప్ప వొడ్డాణం నిత్యమూ ధరించదు. మంగలి హెచ్చు తగ్గులు కత్తిరించాడన్న మిషమీద, మీసాలు తగ్గిస్తూ, ఈనాటికి పూర్తిగా తీసిపేశాడు భాస్కరం. ఎడమ వైపు కింది పన్ను ఊడింది. అందుమూలాన బుగ్గకింద కాస్తంత సొట్ట పడింది. 'అట్లా గుంటేనే నీకు బాగుంటుందిలే'– అన్న రత్నం మాట ప్రకారం, ఆ పన్ను కట్టించుకున్నాడు కాడు భాస్కరం. నుదుటిమీద నాలుగో గీటుకూడా కనబడుతోంది, క్రాపింగ్ వెనక్కి జరిగింది. పాపిడి, పక్కకి జరిగింది. చొక్కాకి కాలరొచ్చింది. ధోవతి సైకిల్ కట్టులో కొచ్చింది. భాస్కరాన్ని చూసి; తనూ మీసం కూడా లాగెయ్యాలనుకున్నాడు. కాని నాగయ్యకి యింకా ఆ ధైర్యం రాలేదు. కోరమీసాలు కత్తిరించి, చిన్నసైజు మీసంతో తృప్తిపడ్డాడు. పల్చటి పంచి కట్టి, పొట మీద ఎంత బిగించినా, బొజ్జ దాగదు; అదొక చింత. కాని దాన్ని గురించి ఎప్పుడ సందు చిక్కడంలేదు. నాగయ్య ఆర్థిక సిరి పెరిగింది. ిరం సాగించే స్తోమత వచ్చింది.

"ఆ మధ్య ఆ వూళ్ళో వొక సభ జరిగిందిలే. అందులో ఒకాయన ఎంకి పాటలు పాడాడు. ఎంత బాగున్నా యనుకున్నావు! వెనక జన్మలో మనం ఎవ్వరమో అనంగానే కంట నీరు పెట్టుకుంటుందిట మనం వెనకజన్మలో ఎవళ్ళ మంటావు?" అన్నాడు భాస్కరం.

"నేను గాడిదను, నాగయ్య సాకలి. నువ్వేమో, ఒక కామందువి- నీ బట్టలుతు కేటందుకు అయ్యన్ని సాకలిమూట గట్టి నా నడుం మీద యేసి చెంగి చెంగి నడిపేవాడనుకో రాదా యేం?"

"ముందు జన్మలో ఏమౌతామో?"

"ఏం భాస్కరం, ఇవాళ అదొకలా మాట్లాడుతున్నా వేం?"

"మనం ఇలా ఒంటిగా కల్సుకుని మాటాడుకుని చాలా రోజు లయిందికదూ"

"అవును తీరదు. యేదో ఒకటి- పిల్లల స్కూళ్ళ కెళ్ళమో జబ్బులో- ఈ కొట్లు కట్టడంతో ఎవ్వరికీ వూపిరాడ్డంలా" అంది సీతా రత్నం.

నాగయ్య వ్యాపారం పెద్దదయి, పై వూళ్ళో కొట్లు కటిస్తున్నాడు. భాస్కరం, సీతారత్నం ఏకాంతంగా కలుసుకుని మాటాడుకునే అవ కాశాలు తక్కువ- రోజూ యేదో సందర్భంగా ఒకర్ని ఒకరు చూసు కుంటున్నా, కలిసిమాటాడుకునేటప్పుడు వారి పిల్లలో, వీరిపిల్లలో వూళ్ళో పెద్దలో- ఎవరో ఒకరు వుంటూనే వుంటారు.

"చెప్పవల్సిన నాలుగూ గబగబ చెప్పెయ్యి. మళ్ళా ఎవడో ఒకడు సిద్ధమవుతాడు" అన్నాడు భాస్కరం నవ్వింది సీతారత్నం.

"యేముంటై. మనస్సులో వుండిపోవాలని టీకా వేసు కుంటిమిగా. విను సెప్తా- ముక్కు పుడక తీసేసా- సూస్తివా?"

భాస్కరం ముక్కుపుడక ఇదివరలో వున్నట్లే గమనించలేదు. అది ముక్కులో భాగమయిపోయింది.

"నిజమేస్మా"

"నువ్వూ తీసేవుగా పీసం- నాగయ్యకూడా నరుక్కుంటూ వొచ్చాడు, పాపం..." అని నవ్వుతోంది.

లేచి అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు భాస్కరం.

తనూ లేచింది.

"వెళ్ళిపోతావా ?"

"అక్కడదాకా వచ్చి దిగవెడతావా ?"

"ఓ"

ఇద్దరూ గోడపక్క పాకలో కొచ్చారు. అక్కడ వెన్నెల సోకడం లేదు. చీకటిగా వుంది. కాలి కేదో తగిలి అతను త్రుళ్ళిపడి ఆమె భుజాన్ని తగిలాడు. ముందుకి పడకుండా కుడి భుజంపై చెయ్యివేశాడు. అతన్ని నిలబెట్టి, ఒకడుగు ముందుకి వేసింది. అతన్ని నులక మంచం మీద కూలబడ్డాడు. తన నడుం చుట్టూ ఉన్న అతని చేతుల్ని తొలిగించి, వెన్నెట్లో నిలబడింది.

"ఎందు కట్లా గయ్యావు ?"

"కాలి కేదో తగిలింది- నిజం."

"నాకు తెలుసు. వొంటిగా వున్నప్పుడు మరీ పదిలముగా వుండాలనుకొంటిమి గాదా ఏం ?"

"పెద్దయినకొద్ది మతిమరుపు జాస్తి అవుతుందిగా"

"కోపమా ?"

"ఆ నిక్కచ్చి చేసింది నేనేగా"

"మరిసినప్పుడలా జ్ఞప్తి చేసింది నేను కాదా ఏం ?"

నిశ్చలంగా పడింది నేలమీద ఆమె నీడ. దాన్ని చూస్తున్నాడు, అచ్చం ఆమెలాగే వుంది ఆమె నీడ అందులో రంగులు, గుండ్రదనం, నునుపు కరుకుదనం- చూపు ద్వారా తెలుసుకున్న స్థూలత్వం- అన్నీ అందులో వున్నట్లు భ్రమపడతాడు.

నాగయ్యకూడా నీ మాదిరే మంచంపైన కూలబడితే లేవలేడు లే," అని పట్టుకోసం చెయ్యిచ్చింది.

"అంత ముసలాన్ని కానులే" అంటూ లేచాడు.

"ఓ యబ్బ ! భాస్కరంగారికి సూర్యుడంత రోషం."

ఇద్దరూ ఆమె ఇంటివైపు నడుస్తున్నారు.

ఇద్దరి నీడలూ తాకుతూ, విడిపోతూ, మళ్ళా రెండూ ఒకటవుతూ— ఒక పెద్ద నీడ ఆకృతి లేకుండా, మబ్బు మేఘాలవలె సాగిపోతున్నాయి. గుమ్మం దగ్గరికి చేరుకున్నారు.

"తలకి పట్టీ వేసేదా ?"

"వద్దులే"

"నిలబడు" లోపలికెళ్ళి సీసా తెచ్చింది. అందులో అంజనం వేలుతో తీసి అతని నుదుటికి రాసింది, వేళ్ళతో కనుబొమలమీద రాస్తూ నొక్కిపట్టి సర్దుతోంది.

"ఇంక చాల్లే" అన్నాడు.

"నిశ్చింతగా పండుకో" అని లోపలికెళ్ళింది. అతని వొంటి నీడని బరువుగా మోసుకొస్తూ పాకదాటి బెంచి దగ్గరకు రాగానే ముందు గోడ తలుపులు తోసుకుని చలమయ్య చక్కావచ్చాడు. అతని వయస్సు నలభైయైదు. యెత్తుగా బొద్దుగా వుంటాడు. పెద్ద మీసం, పెద్ద ముక్కు, పెద్ద కను బొమ్మలు, భీకరంగా కనబడినా, కంఠం సన్నంగా వినబడు తుంది. నిదానంగా మాట్లాడుతాడు. అందువలన సాత్వికుడల్లే కన బడతాడు.

నువ్వు రాలేదేం- మేజువాణికి ?

"దా, దా. కూర్చో తలనొప్పి బద్ధకంగా వుంది. ఇంత దాహం తెచ్చేదా ?" నులకమంచం బైటికి లాగి కూర్చున్నాడు. "పాలికాపును నాలుగు బొండాలు కొయ్యమన్నాను. అడుగో మాటలో వచ్చాడు" పాలేరు కొబ్బరి బొండాలు మూతులు తీసి ఇద్దరికీ యిచ్చాడు. నీళ్ళు తాగు తున్నారు.

"రత్నంకూడా రాలేదుగా" అన్నాడు చలమయ్య.

"అవు నవును"

"నే అనుకున్నాలే"

"అంటే ?"

"చూడు భాస్కరం — ఎప్పటినుంచో నీతో చెబ్దామనుంది. కాని వీలు చిక్కలా, ఇప్పుడు చెప్పనా ?"

పాలికాపుని పొమ్మన్నాడు. వాడు వెళ్ళాడు.

"ఇప్పుడు నాగయ్య లోపల్నుంచి వస్తున్నావు, అవునా?"

"అవును. రత్నాన్ని దిగబెట్టి—"

"ఇం కింటో ఎవ్వరూ లేరు — పార్వతి లేదు, నాగయ్య లేడు — సరేనా ?"

"చెప్పు"

"ఏమిటర్థం ?"

"ఇవాళ కొత్త కాదుగా'

"అదే వచ్చింది పితలాటం. రావిచెట్టు క్రింద ఊళ్ళో వారికి కాలక్షేపం, మీ ఇద్దరి ముచ్చట్లే."

"నేనూ, సీతారత్నమూనా ? ఎన్నాళ్ళనుండో ఇలా వుంటున్నాం. ఇప్పు డేమొచ్చిందీ ఊళ్ళోవారికి?" అన్నాడు భాస్కరం, బెంచి ముందుకు లాగి దగ్గరగా జరుగుతూ.

"ఇప్పుడే రాలేదు, నాలుగైదేళ్ళుగా వుంది యీ రొద. మొదట్లో నేను నమ్మలా, కూక లేశాను. గుస గుసలల్లా గొంతులు లావయ్యాయి. మర్రిచెట్టు కింద పేపరు చదవడం అయినాక మీ ముచ్చట్లే, మొన్న ఓర్సీలుగారింటి కెళ్ళాను. పై వూర్లో— ఆయకట్టు సందర్భం చేసుకొద్దామని, అక్కడ టోపాత్ గుమాస్తా, లస్కరు, మేస్త్రీ—ఇదే ముచ్చట 'ఆయన భార్య, పార్వతి రూపసిటగా ?' అని ఆశ్చర్యం ప్రకటించాడు ఓర్సీలు. ఇది మీకు మంచి పనేనా—పిల్లల తండ్రివి నాగయ్య మోతుబరి — ఊరి పెద్ద. తలెత్తు—చూడు—మాట్లాడవేం ?"

కాసేపు నిశ్శబ్దం. చందమామ మీది సన్నటి మేఘం పొరలా కమ్మింది వేసంగిలో ఉదయపు చలికి, సిల్కు బట్ట కప్పుకున్నట్లు.

నిట్టూర్చాడు.

"తగునా అంట ?"

"మా యిద్దరి మధ్యా ఏం లేదు చలమయ్యా. ప్రమాణం చేసి చెపుతున్నాను – చేతిలో చెయ్యి వేస్తాను. దైవసాక్షి."

"నిప్పు లేంది పొగ రాదు భాస్కరం."

"నువ్వు నమ్మాలి. గ్రెగ్ మెడలు పొందిన పెద్దవి. నిజంగా ఏమీ లేదు. స్నేహంగా వుంటాం – వాస్తవమే. నువ్వూ ఎరుగుదువు. చూసుకుంటా, కబుర్లు చెప్పుకుంటాం అంతే. ఇది నాగయ్యకి తెలుసు, పార్వతికి తెలుసు. వారెప్పుడూ ఇట్లాంటి మాట అనలేదే !"

"ఊరికే కూర్చుండి, మాట్లాడుకుంటారా గంటలు గంటలు ?"

"అవును– గంటలు గంట లేమిటి ! ఇంచుమించు పన్నెండేళ్ళుగా యిట్లాగే వున్నాం."

"ఇది కలియుగం– నేను నమ్మినా, ఊళ్ళో జనం నమ్ముతారన్నది కల్ల– పిన్నా, పెద్దా, ఆడా, మగా కోడై కూస్తున్నారు. నీకు రత్నం అంటే యిష్టమేనా?" అన్నాడు చలమయ్య.

"చాలా ఇష్టం. ఆమెకి నే నంటే చాలా యిష్టం. నాకు పార్వతంటే ప్రాణం; రత్నంకి నాగయ్యంటే ప్రాణం; నాగయ్యకి నే నంటే యిష్టం. పార్వతికి నాగయ్యంటే ఇష్టం— అందరం. అందరం అంటే పడి చస్తామనుకో– నువ్వూ ఎరుగుదువు, ఇదేమిటో ఇదంతా తికమక వ్యవహారమనుకో– ఒకర్నొకరు చూసుకోకుండా ఒక్కరోజు గడవదు. మేం బాగుండటం ఊళ్ళోవారికి గిట్టదా ఏం?"

లేచాడు చలమయ్య.

"చెప్పవల్సింది చెప్పాను. ఊళ్ళో యీ గొడవ మాటుమడిగేలాగున నడుచుకునే భారం మీమైన వుంది. అదెలా సరిపెడతారో."

"ఏం చెయ్యమంటావు– చావాలి అంతే."

"అదేవన్నముక్క - బ్రతికి సాధించాలి."

వెళ్ళాడు చలమయ్య.

భాస్కరం కళ్ళల్లో మంటలు రేగుతున్నాయి — కనురెప్పకింద ఎవరో చిచ్చుపెట్టినట్లు.

నూనెలో ముంచిన కాగడా— కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. ఈ ముక్కలు చలమయ్య నోటంట వినాల్సి వచ్చినదా ? చలమయ్య తలలు మార్చే రకం; ముళ్ళెదతాడు, మనసులు విరిచేస్తాడు. అతని అగడాలు, దురంతాలు చెప్పుకుని నవ్వుకున్నారు. గ్రెగ్ మెడలు ఎవరికియ్యాలి అన్న ప్రశ్న వచ్చినప్పుడు చలమయ్య పేరు చెప్పకూడదని కూడ బలుక్కున్నా, తీరా సమయం వచ్చేసరికి ఇద్దరూ అతని పేరే చెప్పారు అదేం చిత్రమో! ఆ సంగతి తెల్సుకుని ఇద్దరూ నవ్వుకున్నారు కూడా.

తనకీ, రత్నంకీ ఏదో వుందని చలమయ్య చెప్తాడా ? వీడేం మంచివాడని ! ఆ సూరయ్యగారి కూతుర్ని మరిగి, చెరచలా ? ఆ పిల్లకి కడుపు రావడం, లబోదిబోమని పై ఊరెళ్ళి తీయించుకుని గప్‌చిప్ అయిన సంగతి ఎవరెరగరూ. అట్లాంటివాడు తన నీ మాటంటాడా? వీడికి గ్రెగ్గు దొరగారు బంగారు పతకం యిస్తాడా ? ఈ తెల్లవాళ్ళు నమ్మకూడదు గాంధీగారి గుంపులో చేరకుండా, పెద్దల్ని మంచిచేసుకునేందుకు ఈ మెడల్సూ అవీ యివ్వడం. ఈ దొరలు దేశాన్ని పాడుచేసేస్తున్నారు. అందుకనే గాంధీగారు వాళ్ళని తరిమెయ్యడానికి కంకణం కట్టుకున్నారు. ఉపాసాలుట, విదేశీ బట్ట తగలెట్టాలంట; మీటింగులంట— లాఠీచార్జీలు — జైలు కెళ్ళడాలు— ఇవన్నీ ఎందుకు ? చలమయ్యకి మెడలిచ్చి మంచి చేసుకున్న గ్రెగ్గు దొరల్ని తరిమెయ్యడానికి; తను కూడా ఈ గాంధీగారి పార్టీలో చేరిపోవాలి.

ఏమిటో ఇన్ని అనుకున్నా భాస్కరానికి సమాధానం కుదరడం లేదు.

చలమయ్య పేరు చెప్పిన వారిలో తనూ వున్నాడుగా గ్రెగ్గునేం లాభం ? పైగా కూత కూస్తుంది ఊళ్ళోవారు, చలమయ్య కాడఃగా. వాళ్ళ

కెందుకు ? వాళ్ళేం చూశారు ? చలమయ్య బోటిగాళ్ళు చెప్పకపోతే వాళ్ళకేం పట్టింది. మర్రిచెట్టు కింద లోకాభి రామాయణం ?

ఊరికి నిప్పు పెట్టాలి. నిప్పంటేగాని పొగ రాదుట నాగయ్యతో చెప్పాలి. చెప్పి ఏం లాభం ? అతనేమను కుంటాడు- అతని మనస్సు చెడిపోదూ ! రత్నంతో చెప్పాలి. గబ గబ లేచి నాగయ్య ఇంటి కెళ్ళాడు భాస్కరం.

తలుపుతోసి వరండా పక్కగదిలో కెళ్ళాడు. భోషాణం పక్క లాంతరుంది. పంజరంలో పిట్ట కళ్ళు మూసుకుంది. భోషాణం కింద నుంచి రెండు ఎలుకలు పరుగెత్తాయి ఉలిక్కిపడ్డాడు. లాంతరు పైకెత్తి మంచ ముపై పరున్న సీతారత్నాన్ని చూశాడు. నిద్రపోతోంది. పమిట జారింది. రవిక రెండు బొత్తాముల మధ్య బిగుతై ఏర్పడిన రంధ్రం ఆకులా కన బడుతోంది. శ్వాస వినబడుతోంది— లేపడానికి చెయ్యి పైన వెయ్య బోయ్యాడు. ఆమె లేచి ఏమంటుందో— ఆ సమయంలో నాగయ్య వస్తే ఏమనుకుంటాడో— చెయ్యి దించేశాడు. మెల్లగా వెన్నెట్లో కొచ్చేశాడు.

పార్వతీ, పిల్లలూ ఇంటికొచ్చారు.

"ఆ ముక్కుపుడ కేమిటి ?" అన్నాడు.

"రత్నంది— పెట్టుకోమంది- బాగుందా ?" నవ్వొస్తుంది ఆడ వాళ్ళ వ్యవహారాలు చూస్తే. పడుకున్నాడు భాస్కరం. పది నిముషాల్లో ఒకటి రెండు నిర్ణయాలు చేసుకున్నాడు. దానితో బరువు తగ్గింది. కంటిలో కాగడాలు చల్లారుతున్నాయి. నుదుటిమీద అంజనం ఆరి పోతోంది. ఒళ్ళు తెలీని నిద్ర పట్టేసింది.

* * * *

రెండు మూడు వారాలు గడిచాక సీతారత్నంతో ఏకాంతంగా గడిపే అవకాశం దొరికింది. పార్వతి, వాళ్ళ బాబయ్యగారి తాలూకు ఎవ రిదో పెండ్లికి పై ఊరెళ్ళింది చిన్నపిల్లల్ని ఇద్దర్నీ తీసుకుని. వంటకు దూరపు చుట్టం రంగమ్మ, స్కూలు కెళ్ళే పిల్లలూ తనూ వుంటారు. నాగయ్య ఇంజనీరుగార్ని చూడ్డానికి బస్తీ వెళ్ళాడు. సాయంత్రం ఆరైంది. పిల్లలు పెద్దయ్యతో కలిసి నాటకం చూడ్డానికి పొయ్యారు వెళ్ళారు

రంగమ్మ ఆలయంలో పురాణం చెపుతుంటే వినడానికెళ్ళింది. సాయంత్రం ఆరు దాటింది. చీకటి రాత్రుళ్లూ, చలిరోజులూ– సంధ్యాదేవి ఎర్ర చీర ధరించి ముస్తాబై గుమ్మంలోకి రాగానే ఎవరో గుమ్మం తలుపులు మూసినట్లు, ఆకాశంలో చీకటి అలుముకుంది. కొబ్బరిచెట్ల కింద పచార్లు చేస్తున్నాడు భాస్కరం. ఏదో చప్పుడయింది. ఎవరో చప్పట్లు కొడుతున్నారు. పక్కకు తిరిగాడు. నాగయ్యగారి దొడ్లో జామచెట్టు కింద రెండు కుక్కలు చేరాయి. ఆడదీ, మగదీ– ఒకటి మీది మీది కొస్తూంది. రెండోది అయిష్టంగా మొఱిగి తప్పుకుంటోంది. వాటిని బయటికి తరిమే ప్రయత్నములో వుంది సీతారత్నం. అవి గోడవతలకి వెళ్ళాయి. భాస్కరాన్ని రమ్మని సంజ్ఞ చేసింది.

మండువా గది దాటి ఖాళీ స్థలంలో కొచ్చాడు. అక్కడ మడత మంచం వాల్చి కూర్చున్నాడు. పంజరంలో పిట్ట వూరికే అరుస్తోంది. సీతారత్నం లోపల్నుంచి, రెండు డబ్బాలు తెచ్చి, వాటిల్లోంచి తినుబండారాలు ఆకులో వేస్తూంది. కొన్ని పూతరేకులు, కజ్జికాయలు, గవ్వలు, లడ్లు–

"తిను. మా వాళ్ళు పంపారు. ఈ డబ్బా అబ్బాయిని తీసికెళ్ళమను"

"సీతో ముఖ్యమయిన విషయం మాటాడాలి రత్నం" అని ప్రారంభించాడు భాస్కరం, గొంతు సవరించుకుని.

"తింటూ చెప్పకూడదా ఏం !"

ఆ పదార్థం ఏమిటో తెలియకుండా– ఒక్కొటొక్కటి నోట్లోవేసుకుంటున్నాడు.

"ఇలా కూర్చో"

"కూర్చుంటాలే" అని ఎత్తు కాళ్ళపీట లాక్కుని మంచం దగ్గరగా కూర్చుంది. అటూ ఇటూ చూస్తున్నాడు.

"ఇది రహస్యం"

"మనకి రహస్యా లేముంటాయి !"

"మనిద్దరి మధ్యనా యేదో వుందిట- ఊళ్ళోవారను కుంటున్నారుట..."

తల వెనక్కి వ్రేలాడేసి, పడిపోకుండా— అరచేతులు మెడ వెనక బిగించి నవ్వుతోంది సీతారత్నం.

"నవ్వుతావేం ?"

నవ్వు ఆపుకుంది.

"నీకోక్కపం రాలేదూ !"

"ఉందిగా— ఉన్న యిషయమే వాళ్ళు సెప్పుకుంటున్నారు. కోపం దేనికేం ?"

"ఉత్తుత్తి వుండటం కాదు. నిజంగా ఉండటం..."

"అంటె !"

"ఉంచుకోవడం..."

మళ్ళా నవ్వుతోంది.

"ఇది నవ్వుతాలు కాదు. చలమయ్య చెప్పాడు. మనిద్దరి మధ్యనా యేమీ లేదని ప్రమాణం చేసి చెప్పాను"

"ఆఁ ఉంచుకోవడమా ?... చలమయ్య పెట్టుకున్నాడుగా..."

"ఆ పిల్ల వెళ్ళిపోయింది"

"నాకూ తెల్సు- మరోదాన్ని పెట్టుకున్నాడు"

"నిజం !"

"ఈ ఊర్లో యేది జరిగినా, నాగయ్యకి తెలవకుండా జరుగుతుందా యేం ?"

"మన విషయం ఊర్లో వాళ్ళు చెప్పుకుంటున్నట్లు నాగయ్యకి తెలుసా ?"

"నే నడగలా— ఆయన చెప్పలా"

"మనిద్దరి మధ్య యేమీ లేదని నువ్వు ఒప్పుకుంటావా ?"

మళ్ళా నవ్వుతోంది. కొప్పు వూడింది. జడపాయలుగా భుజంమీదికి

జారింది. దగ్గరగా చేర్చి, అల్లి ఒకటిగా సర్దుతోంది. ఆ మదతలో తెల్ల వెంట్రుకలు కనబడ్డంలేదు.

“ఉండు— దీపం తెస్తా” అని లేవబోయింది సీతారత్నం. “తేవద్దు” అని చెయ్యి పట్టుకుని కూర్చోపెట్టాడు.

“చెయ్యి చేసుకుంటున్నావే!”

“చేసుకుంటాను. ఆ నిర్ణయాని కొచ్చా”

“అంటే ?”

“చూడు రత్నం. మనిద్దరి మధ్య యేమీలేదు— స్నేహముగా ఉంటున్నాం— చూసుకుంటున్నాం— కబుర్లు చెప్పుకుంటున్నాం… పది పదిహేనేళ్లుగా ఏదో వుందని నోరు పారేసుకుంటున్నారు, ఊరి జనం— వాళ్ళని మనం యేమీ చెయ్యలేం. వాళ్ళు అలా చెప్పుకోటం ఎలానూ మానరు— కాబట్టి మనిద్దరి మధ్య యేమీ లేకుండా ఎందుకుండాలి ?”

“మనం ఇట్లా ఉండటం వాళ్ళకోసం కాదుగా” అంది.

“వాళ్ళు అలా అనుకుంటున్నారు గనుక— మనం మాత్రం ఎందుకూరుకుంటం? మంచివాళ్ళమన్న పేరు దక్కలేదు— ఇదీ దక్కలేదు…” ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు.

“ఇప్పుడే వొస్తా” అని విడిలించుకుని లోపలికెళ్ళి లాంతరు తెచ్చింది. దాహం తెచ్చి తాగమంది.

“ఏం నేనంటే ఇష్టంలేదా ?”

అతనికేసి దిగులుగా చూసింది. అతని కళ్ళల్లో తడి మెరుస్తోంది.

“ఇష్టముంది. అందుకనే ఒద్దనుకుంటిమి—”

“అదేమన్న మక్క ?”

“టికా చేసుకుంటిమిగా. ఇదే బాగుంది మనకి సీకూ సింతాలేదు. ప్రాణం సహాయనుకో. ఊళ్ళో వోరేమనుకుంటె మనకెందుకు—మన మనస్సులే సాక్షం.”

“కాదు. నా మనస్సు పాడయింది. నిన్ను ఒదులుకోలేను. ఒచ్చిన

పేరెల్లానూ ఒచ్చింది. ఇంక తెగిద్దాం...” అంటూనే భాస్కరం తన మొహం ఆమె ఒడిలో వాల్చాడు. చీర మడతల్లోంచి పొత్తికడుపు మందం తెలుస్తూంది కాని— చర్మం స్పర్శ తగలడంలేదు. కంగారుపడి సర్దుకుని అతని తలని పైకెత్తి తను లేచి నిలబడింది సీతారత్నం.

“పసివాడివా భాస్కరం?”

దూరంగా వెళ్ళి ప్రక్కకు దిరిగి, చీరబిగిస్తూంది. దీపం వెలుగులో పొట్టమీద చారలు కనబడుతున్నాయి— రేగడి గట్లను వరదనీరు పాయలుగా కోసినట్లు—

“ఏం, ఇష్టంలేదా ?”

“కానా ఇష్టం— అంటావుగాని నీకు మట్టుకు ఈ మాదిరుండటం, యిష్టంలేదని, నాకు తెల్దా ఏం! ఊళ్ళో వారిమీద కోపంవల్ల, మనం కోతులవుతామా, ఏమరపాటున యే చెయ్యో, భుజమో తగిలితే నువ్వు మాత్రం ఇదిలించి పారెయ్యలేదా ఏం ?”

పని పిల్లొచ్చింది— కిరసనాలు డబ్బాతో.

బట్టల మూట దించాడు చాకలి.

దూడల్ని కట్టేస్తున్నాడు చిట్టిగాడు.

“పనులు చూసుకురానా ?”

భాస్కరం తనింటి వైపు వెళ్ళాడు.

ఆ ఏడాదిలో పది పన్నెండుసార్లు వారిద్దరూ ఒంటిగా కల్సుకుని మాటాడుకునే అవకాశాలొచ్చాయి. ఊర్లో ఆ రకం అపవాదు ప్రబలింది గనక, అన్న ప్రశ్నని ఎన్నోసార్లు వితర్కించుకున్నారు.

“ఈ వయస్సులో యేమిటి?” అంటూంది సీతారత్నం.

“యిప్పుడే కావాలి. చిన్నప్పుడు అదేమిటో తెలీదు” అంటాడు భాస్కరం.

“పిల్ల లెదుగుతున్నారు” అంటుంది.

“వారికి మన గొడవ లేదుగా” అంటాడు.

"మననులు పాడుచేసుకుంటామా ?" అంటుంది.

"ఊర్లోవాళ్ళు ఎలానూ చెడగొట్టారుగా" అంటాడు.

తన ఉద్దేశం ప్రకారం ఆమె నడచుకోదలచకపోతే తనకి ఊళ్లోంచి వెళ్ళిపోవడంతప్ప గత్యంతరం లేదన్న నిర్ణయం బైటపెట్టాడు భాస్కరం, మరుసటి సంవత్సరం.

"వాకబు చేశా- ఒకాయన పట్నంలో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. ఇక్కణ్నించి మకాం ఎత్తేస్తా. వీళ్ళ నోళ్ళు కట్టడుతై. పీడ విరగడై పోతుంది" అన్నాడు.

ఆమె నవ్వింది.

"ఆళ్ళకి మరీ అలుసైపోదూ- యేదో వుండబట్టే, హమలి పారి పొయ్యారనుకోరా యేం?" అంది రత్నం.

మరో నాలుగు నెలల తర్వాత.

"పార్వతితో చెప్పేసి- ఒప్పించి ఉద్యోగంలోకి పోతా అన్నాడు.

"పార్వతి ఒప్పుకోదు. నేను ముంగలే చెప్పేశాను- మీ రెల్తానికి పిల్లేదని"

"యేమంది ?"

"ఇప్పుడెక్కడికి పోతం- ఎందుకు పోతం అంది - ఊ ఒకటే నవ్వులు"

మరో రెండు నెల లయ్యాక.

"ధరకాస్తు పడేస్తున్నా"

"నన్ను విడిసి నువ్వెళ్ళగలవా ఏం మహా-"

"లేకపోతే. గాంధీగారి గుంపులో చేరి లాఠి దెబ్బలు తిని జెలుకు పోతా."

'అమ్మో- జైలే : మరి సూడ్డం ఎల్లాగా ?"

'అప్పుడప్పుడు చూడడానికి రానిస్తారుట.'

భాస్కరం తెగించి ఏదీ చెయ్యలేకపొయ్యాడు. కొత్త పనులు

కల్పించుకుని వాటిల్లో నిమగ్నుడయి అన్నీ మరిచిపోడానికి కృషి చేస్తున్నాడు. ఊళ్లో పిల్లల్ని పిలిచి, 'రాత్రి బడి' పెట్టి పాఠాలు చెప్పడం మొదలెట్టాడు. ఒక రాట్నం కొని నూలు తీయడం పెట్టుకున్నాడు. ఖద్దరు దుస్తులు ధరిస్తున్నాడు కాలువమీద వంతెన వేయించాలని, నలుగుర్నీ కలుసుకుని, 'అర్జీలు' పెట్టిస్తున్నాడు. ఒకటి రెండు నెలలయ్యాక నాగయ్యకి జబ్బుచేసి నిమ్మళించింది.

ఏదో వనసంతర్పణ ఏర్పాటు చేశాడు నాగయ్య. వోమారు భాస్కరం వెళ్ళి, యేదో పనుందంటూ గంటలో ఇంటి కొచ్చేశాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు—గొడ్లపాక దగ్గర నాయన్న తప్ప మండువాగది మంచం మీద పరున్నాడు భాస్కరం. నిద్ర పట్టేసింది ఎవరో పలకరించి లేపినట్లయింది. కళ్ళు నులుముకుంటూ లేచాడు. సీతారత్నం మంచంపక్కన బల్లమీద కాళ్ళవైపు కూర్చుని, మంచం బద్దెమీద చేతులానించింది.

'ఏం అప్పుడే అయిపోయిందా'

'ఒచ్చేశావేం ?'

'పనుందిలే'

'నిద్రేగా. నాకు తెల్సులే ! నీకు కోపం మాపీద'

'మీమీ దెందుకు ?'

"నాకు తెల్సు, నీకూ తెల్సు. ఊర్లోనుంచి పోతా వంటావుగా."

"మళ్ళా ఇప్పుడు ఆ మాటలన్నీ ఎందుకులే" అన్నాడు. కొంచెం దగ్గరగా జరిగింది తొలిగి, దూరంగా కూర్చున్నాడు. కాసేపయ్యాక లేచి, బద్దీమీద ఆనుకుని నిలబడ్డాడు.

"కోపం పోగొట్టేదా" అంది సీతారత్నం.

"నాకు యే కోపమూ లేదు – నువ్వు పోగొట్టనూ వద్దు."

"నే నిక్కడ కొచ్చి చాలా సేపయింది తెల్సా–నువ్వు తోటలో కన బడలేదు. యిక్కడుంటావని - వచ్చాను. అట్లా రెప్ప వాల్చకుండా చూస్తున్నా - నీకేసి..."

"యెందుకో ?"

"నీకూ నాకూ ఊహలు చేతకావు. అదే పీకులాట" కళ్ళు చిట్లించి ప్రశ్నార్థకంగా చూస్తూంది. ఊపిరి తీసినప్పుడల్లా వక్షం పైకి లేచి, మంచం బద్దిమీదున్న పరువుని వంచుతోంది. అతనికేసి జరిగింది. అతను తొలిగి అవతల వైపు కెళ్ళి నుంచున్నాడు.

"సరేలే, తెల్సిందిలే," అంటూ కోపంగా మూతి ముడుచుకొని లేచి వెడుతోంది.

"దిగబెడుదువుగాని రా," అంది.

అతనూ వెనకాలే వెళ్ళాడు. ఎవ్వరూ మాటాడలేదు. దొడ్లో, ఒక్క పుంజు పెట్టని గదుముతోంది. అది భయపడి పరుగెడుతూ, వాళ్ళ కాళ్ళ మధ్య కొచ్చింది. పుంజు పక్కగా వొంగి వొదిగి, రెక్కలు విదిలించి దాబాయిస్తోంది. రాయి తీసి పుంజును కొట్టాడు భాస్కరం "రాతి గుండెస్కా" అంటూ వెళ్ళి తలుపు జార్లవేసింది. తను మాత్రం ఎందు కిష్టపడాలి ? బెట్టు చేయటం తనకి చేతనవును.

ఆరేడు నెలల తర్వాత, సీతారత్నంకి జబ్బుచేసింది. తనూ, పార్వతీ, పిల్లలూ, రోజల్లా ఆమె దగ్గరే గడిపి కావల్సినవి కనుక్కొని ఆదరించేవారు. ఆమెకు పొద్దుపోయేది కొన్ని రోజులలో కోలుకుంది.

నాలుగో నెలని స్థిరపరిచారు.

రాత్రి పదయింది. గాదికొట్ల చూరుమీదనుంచి చందమామ లేచింది నిలబడ మన్నట్లుగా నాలుగయిదు మేఘాలు చుట్టుముట్టాయి బెదిరి చంద మామ పూలమొక్క వెనుక దాక్కుంది. సిగ్గుతో పుష్పాలు ముడుచు కున్నాయి. నాగయ్య ముందు గదిలో నిద్ర పోతున్నాడు. భాస్కరంగా రింట్లో దీపాలు తియ్యలేదు. ఎవరో ఇద్దరు ముగ్గురు పై ఊళ్ళ వాళ్ళొచ్చి జాతకాలు తిరగేసి కబుర్లు చెప్పుకుంటున్నారు. పావుగంటలో సద్దుమణి గింది. నిద్దరావడం లేదు. సీతారత్నం దొడ్లోకి వెళ్ళింది. గోడదాటి

సామానుల గదిదాటి, బస్తాల మూటల వెనుక మంచం మీద పడుకొన్న భాస్కరంని లేపింది. తన వెనకాల రమ్మని సంజ్ఞ చేసింది. అతని కర్థం కాలేదు.

"ఉండు. లోపల కెళ్ళి కర్రట్టుకొస్తా."

"ఇస్, అరవమాక...తోచటంలా. కబుర్లు చెప్తవు కాని, అందుకే పిల్చా."

మండువా పక్కన అరుబైటచాపేసింది. కూర్చుంది. తల సగం వెన్నెట్లోనూ, సగం నీడలోనూ వుంది – రెండుగా చీలినట్లు.

"ఊరికినే – సాలా రోజులయింది. నీతో కబుర్లుసెప్పాలని మనసోయింది పార్వతి చెప్పిందా ?"

"ఏమని ?" అని ప్రశ్నించాడు ఆశ్చర్యం కనబరుస్తూ.

"మొదటిసారి, జ్ఞాపకముంటే, నాలుగో నెలవంగానే, సూడాలని మను సేసి కబురంపాను. ఇప్పుడూ అదే." అని పళ్ళు ప్రదర్శించకుండా నవ్వుతోంది. అరిచెయ్యి విప్పి, చిటికిని ప్రేలు మడిచి మిగతా నాలుగు వేళ్ళను చూపింది. చిటికిన ప్రేలు ప్రక్కనున్న ఉంగరం ప్రేలుకూడా కాస్త మణిగింది.

"నువ్వు మణచగలవా ? – వుంగరం వేలు కదలకుండా చిటికిన ప్రేలు మాత్రం వొంచాలి ఏదీ చూపియ్యి."

అతను యత్నించాడు సాధ్యంకాలేదు.

"నువ్వూ అంతేనా – నామాదిరే – ఒక్కవేలు మడవలేవు. ఆ రెండు వేళ్ళు మనలాంటి జంటనుకో. ఇది వొంగకుండా అది వొంగదు. తమాషా"

అతను వేళ్ళతో ఆట నిలిపేశాడు.

"ఈ మధ్యనేగా జబ్బుచేసి తేరుకొన్నది – మళ్ళా నాలుగోమాసం – ఏమిటి ? జబ్బు అబద్ధమా. ఇదబద్ధమా ?" నవ్వుతూంది.

"నాగయ్యకి మల్లెనే నీకూ భలే రోసం. నువ్వన్నదే రైటు. మన

సులో వున్నాక వొంటిలో వుంచేనేం - శాతనైతే అదీ వుండకూడదు-ఇదీ వుండకూడదు. అవునా ?"

"మన మనస్సులూ బాగున్నై వొంటినీ భద్రం చేసుకున్నాం. ఊళ్ళోవాళ్ళు గొడవచేస్తున్నారు. ఇంకెందుకు భద్రంగా వుంచటం ?"

"నువ్వు చెప్పింది, నాకూ నచ్చింది. వొంటినిభద్రం చేసుకోవద్దులే -- మనసుని పదిలం చేసుకొందాం - అది వీలేనా ?"

"మనసులో ఏముందో ఎవడు చూడొచ్చాడు ? ఊళ్ళో వాళ్ళు చూశారా ? భద్రంచేసుకోడం మాటపడ్డం రెండూ దేని కని ?"

"నేనూ అదే అడుగుతుంద. మంచిరోజు చూడు మరి..."

చెయ్యిజాపి ఆమెను తాకబోయాడు.

"ఆ రోజున గణేశావుగా. ఇప్పుడ.కూ డా ఇష్టంలేకుండానే ఊళ్ళో వాళ్ళమీద కసొచ్చి రంకె లేస్తావా భాస్కరం. ఇంటికాడ జాతకాలు చూస్తానన్నారుగాశాస్తుల్లు. మూర్తం పెట్టించు."

లేచింది చాప చుట్టింది.

"పొద్దోయింది పొద్దునే వొపాలి పార్వతిని కనబడమనేం." లోపలి కెళ్ళింది. మెల్లగా తన మంచంమీదికి చేరుకొన్నాడు భాస్కరం. ప్రాణం కుదుటబడ్డట్లయింది. ఇంక ఊరుకోకూడదు. ఊళ్ళోవాళ్ళు గొంతుకులు పొయ్యేటట్టు అరచి చావనీ. సీతారత్నం కడుపుకింద చారలు, సనాల మధ్య లోతుసీడ, గుండ్రని పిరుదులు, ఊహిస్తూడంగా నిద్ర పట్టేసింది.

రోజులు, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. మంచి ముహూర్తం కుదరడం లేదు. ఏదో అడ్డు తగుల్తూనే వుంది. ప్రతి రోజు ఎప్పట్లాగే కలుసుకొంటూ వున్నా, కళ్ళతో మాట్లాడుకొంటూ వున్నా వారి మధ్య ఏదోగోడని ఎవరో లేపుతున్నట్లుంది. ఒకపొర ఇటికలు పేర్చారు. దూకేటప్పుడు అవి కాలికి తగిలి, పడ్డం, లేవటం జరుగుతూంది ఇంకా గాయాలు తగ్గలేదు. రాత్రిబడి జోరుగాసాగుతోంది. పెద్దలుకూడా పాటాలు చెప్పమని వస్తున్నారు. గ్రెగ్గ దొర గారికి ట్రాన్స్ఫరయింది.

స్టీవెన్‌సన్ అనే కొత్తాయనొచ్చాడు. కాలవమీద వంతెన శాంక్షనై కట్టడం ప్రారంభించారు.

పొగాక్కి, రావలసిన రంగురాక నాగయ్య కాస్త దెబ్బతిన్నాడు అతని పనులలో తిరుగుతూ భాస్కరంకి తీరికుండడం లేదు. రెండు నెలలు సీతారత్నంగా రమ్మాయి మాణిక్యంకి జ్వరం. మందులు, మరో నాలుగు నెలల తరువాత వాళ్ళ మూడోవాడికి జ్వరం. భాస్కరంగారి మొదటి వాడు కిష్టయ్య -ఏం తిరకా సొచ్చిందో-అలిగి, ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. సినిమాలు చూడ్డానికి, పెద్దమ్మగారి గ్రామములో దాక్కొని వారం తర్వాత కనిపించాడు నాలుగు వూళ్ళూ గాలించక.

ఐదారేళ్ళూ యిట్టే వెళ్ళిపోయాయి - తలలో తెల్ల వెంట్రుకల సంఖ్య పెరగడం వారు గమనించలేదు. భాస్కరం కంటిచుట్టూ నలుపు అలుముకుంటోంది. సీతారత్నంకి మొగపిల్లవాడు పుట్టి నెల తిరక్కుండా చనిపొయ్యాడు. నాలుగు నెల్లకికాని దుఃఖాన్నుండి తేరుకోలేదు. ఆమె మెడ మీద గీట్లు కనబడుతున్నాయి. పొత్తికడు మీద చారలు పెరుగుతున్నాయి. నడుం వెడల్పవుతోంది. దారం తెగినా - గాలి ఒత్తిడికి తక్షణం కిందికి దిగిపోకుండా, పైపైన అల్లలాడుతున్న బుడగలల్లె స్తనాలు బిగిసడిలి వంగుతున్నాయి. రవిక బిగించినచోట్ల, వెన్నుమీద నల్లగా మచ్చ పడుతోంది. యివేవీ వారికి తెలియవు వారి మనసులో ఏముందో వారికి తెలుసునేమో.

అది వేసంగి ప్రారంభం. ఎండలు మండుతున్నై. దగ్గఱ బంధువులెవరో చనిపోతే పిల్లన్ని తీసుకుని పరామర్శ కెళ్ళింది పార్వతి. పెద్దవాడు స్కూలు పిల్లలతో కలిసి చుట్టుపట్ల చారిత్రక స్థలాలని చూడ్డానికి వెళ్ళాడు. నాగయ్య పనిమీద వూరెళ్ళాడు.

ఆనాడు శుక్రవారం-మర్నాడు పూర్ణిమ. సీతారత్నం తలంటి పోసుకుంది. గుమ్మం ముందు నిలబడి జుట్టు ఆరబెట్టు కుంటోంది. గోడ దగ్గరికి నడిచొచ్చింది. భాస్కరాన్ని చూసి నవ్వింది గాజులు మెరుస్తూ

న్నాయి. భుజాలని పట్టుకున్న పుంల డిజైను రవిక వేసుకొంది. కన బొమ్మలమీద పసుపు పూర్తిగా పీడలేదు. పాపిడి రెండు ప్రక్కలా తెల్ల వెంట్రుకలు మెరుస్తున్నాయి. తెల్ల ఖద్దరు చీరలో నడుం గుండ్రంగ వెడల్పుగా కనబడుతోంది.

'ఖద్దరుచీర బావుందా ?'

అత నేమీ మాటాడలేదు.

'ఇదంతా ఎందుకో తెలుసా ?'

నవ్వాడు భాస్కరం.

'మధ్యాహ్నం ముంజిలు పంపేదా ?'

యేమీ మాటాడలేదు.

'పదింటికి ?'

సమాధానం లేదు.

'ఐంద నిద్ర పోమాక.'

అని వెళ్ళింది. సాయంత్రం ఒక్కడూ పొల మెళ్ళాడు భాస్కరం. మామిడి తోపులో నీడలో కూర్చున్నాడు. మనసు ప్రశాంతంగా వుంది. ఎగురుతూ, ఆడుతూ పాడుతూ గుండ్రని కాయల్ని దొర్లించుకుంటూ వెడు తున్న ఉడుతల్ని దీక్షగా చూస్తున్నాడు. చెట్ల ఆకులమధ్య గాలి గుస గుసలు వింటున్నాడు. ఏదో వెలుగు కనబడి నీడలో అంతర్ధానమైనట్లుంది ఆ వెలుగు తన శరీరంలో జొరబడి నట్లనిపించింది. రక్తం నరాలు కొత్త దోవలు వెదుకుతూ, పీకి పెనుగులాడుతున్నాయి. ఆ శరీరం - ఆ చేతులు- కళ్ళు- నడుం- తనవే... రత్నానికి ఒప్పగించాలి- పార్వతి కొప్పగించినట్లు యింతకాలంగా పార్వతికి వప్పగించినా తనవిగా తనవిగా తన దగ్గరే వున్నా యేం? ఒప్పగించటం ఏమిటి ? రత్నం - తన వంటిని వప్పగించేస్తుంది మరో నాలుగు గంటల్లో ఆమె నెరుగునా తను ? ఆమె తనెవరో నెరుగునా ? అంతా గొడవగా వుంది. గట్టు కనబడక ఉబికి, పొంగి, గెంతిపొయ్యే నీటి ప్రవాహంలా.- అతని మనస్సు శరీరంలోని

ఇంద్రియాలు ఏకమై తిరుగాడు తున్నాయి. కాళ్ళు అతన్ని యింటికి ఈడ్చుకెళ్ళాయి.

పిల్లలు చాపలేసుకుని వెన్నెట్లో కూర్చున్నారు. భోజనము చేసి - పాటాలకి కూర్చున్నారు. కబుర్లు పాటాలు పూర్తయ్యేసరికి తొమ్మిదైంది.

యింకా గాలి మొదలెట్టలేదు— ఉక్కగా వుంది. దొడ్లో కెళ్ళి నాలుగు చెంబులు చన్నీళ్ళు పోసుకుని— తెల్లటి ఖద్దరు లాల్చీ, పంచ వేసుకొని, తువ్వాలు భుజంపై ఉంచుకుని పాపిడి లేకుండా- క్రాఫింగ్ ఒక ప్రక్కకి దువ్వి, గోడ పక్కన పడక కుర్చీలో కూర్చున్నాడు భాస్కరం. పక్కన మంచం- పరుపూ వున్నాయి. మంచం కింద నీళ్ళకుండ గ్లాసు వున్నాయి. గాలి ప్రారంభమయింది ? శరీరంలోకి జొరబడ్డట్లుంది. లాంతర్లో ఒత్తి పెద్దదిచేసి పత్రిక చదివే యత్నం చేస్తున్నాడు. గుమ్మంలో తలుపు తోసుకుని ప్రవేశించాడు చలమయ్య.

"సీతిగాణ్ని బొండాలు దింపమన్నాను. అడుగో— అదుగోరా గ్లాసు—— బొండాంపళంగానే ఇయ్యి నాకు మట్టుకు.

నీళ్ళు త్రాగడం పూర్తయింది. సీతిగాడు వెళ్ళాడు. "రేపదెల్లుండికి సంతర్పన చెయ్యాలి భాస్కరం—— సిద్ధపడు" అన్నాడు చలమయ్య.

"ఏం ఎందుకు ?"

"నీ కింకా తెల్దా ? స్టీవెన్సన్ దొరగారు మెడ లిస్తారుట నీకు ? వూళ్ళో పెద్ద లందరూ నీ పేరే చెప్పారు. మంచోడివిట- మంచి పనులు చేస్తూంటావుట— నీతి జాతి గల పెద్ద మనిషి వంట అందుకు మెడల్సు. భలే అదృష్టంలే— నీది. నేనూ నీ పేరే చెప్పినానులే." అన్నాడు చలమయ్య— భాస్కరము ఆశ్చర్యపడ్డాడు. నమ్మలేకపోతున్నాడు.

"నిజంగా- ? నాకు ?"

"అవును నీకే. ఇందాకనే నిర్ణయం జరిగింది— నాగయ్యకి కబురంపా. దిగువు వంతెన తెరుస్తారంట దొరగారు- ఆ రోజునే మెడలివ్వడం తంతుట—— పార్వతికి కబురెట్టు. రత్నంకి నే చెప్పే వచ్చాలే."

"నా కంతా తమాషాగా వుంది చలమయ్యా- వెనక ఐదా రేళ్ళ క్రితం- అన్నావు జ్ఞాపకంవుందా- ఇక్కడే- యిలాంటి వెన్నెట్లోనే. ఈ వూరు విడిచి వెళ్ళిపోదామనుకుంటున్నాను కూడా."

చలమయ్య కంఠం బొంగురోయి. మాటజోరు తగ్గింది. వెనకటి చలాకీ, వేగం తగ్గాయి.

"ఏదో కుర్ర సన్నాసులు అనుకొన్నారు. నిజం నిలకడ మీద తెలీకుండా పోతుందా..."

ఇంతలో లాకు దగ్గర పడవలు అవతలకి పోకుండా లాకు సూప రెంటుగారు పేచీ పెడుతున్నారు. తమ రొచ్చి సాయపడాలి- అంటూ బెస్తవాళ్ళు బయట తమకోసం కూర్చున్నారని చిట్టిగాడు చెప్తున్నాడు.

"కనుక్కు నొస్తా" అని చలమయ్య వెళ్ళాడు.

అరు బయట ఉన్న చాపలూ, పుస్తకాలూ లోపల పెట్టడానికి యింట్లో కెళ్ళాడు భాస్కరం. దిండు తీసుకొని బయట కొచ్చాడు. మంచం అక్కడ లేదు. గోడపక్క కొట్టు గదిలోకి యీడ్చా రెవరో. మంచం మీద కూర్చునుంది సీతారత్నం- పక్కన అమ్మాయిని పరుండ బెట్టి జోకొడుతోంది.

"ఇదేవిటి- చీకట్లో కూర్చున్నావ్ !"

"భాస్కరం వుండగా చీకటేమిటి- యింకనుంచి దీపం ముంగ లున్నా, నే కనబడతానా ఏం ? నువ్వు గొప్పోడి వయ్యావుగా— దొర గారు మెడ లిస్తున్నాడంట."

"అవునట. యిదో కుమ్మరాం వొచ్చిపడిందేమిటి- అదిపోనిస్తూ— నీ కోసమె వేచివున్నాను ప్రొద్దుట్నుంచి" అన్నాడు భాస్కరం.

"నే మాత్రం వేచివుండ లేదా యేం ?"

"నిజంగా-"

"అవును. ప్రొద్దుట అనుకుంటిమిగా."

"ఒకటి చెప్పనా రత్నం- ఈ పూట నీ వొళ్ళొ తలెట్టుకుని ఏడ వాలనుంది." కుర్చీలోంచి లేచి మంచం మీదకి చేరుకున్నాడు.

"ఆ తట్టు పిల్లా- లెగుస్తుంది- యిటు కూకో" అంటూ తనెళ్ళి కుర్చీమీద కూర్చుంది.

పిల్లని దగ్గరకు తీసుకొని ముద్దాడాడు. "అచ్చంగా నీ పోలికె- నిన్ను చూసినట్లె వుంటుంది."

"ఇంక నయం- పార్వతి నాగయ్య మొహం అంటుందిగా- పోలికలు అదోళ్ళకి బాగా తెలుస్తాయిలే" అంది సీతారత్నం మంచం కొంచం ముందుకి జరిపాడు. ఆమె నడుం చుట్టూ రెండు చేతులూ వెయ్యబోతున్నాడు. లేచింది సీతారత్నం- కుర్చీ నీడలోకి లాగింది.

"ఇంకెందుకు భాస్కరం, మన మీ పని సెయ్యనే కూడదు. వూర్లోవోళ్ళు నువ్వు పెద్ద మనిషని మెద లిస్తావుంటే, యింకెట్లా వీలు పడుతుందేం- నింపళంగా ఆలోచించు"

"అవును రత్నం. నాకూ అనిపించింది. మనమీద అందరికీ అంత నమ్మకం కుదిరి మెచ్చుకుంటూ వుంటే ఇంక మనం మునపటి లాగే వుండటం మంచిది- కాని——"

"కానీ లేదు, ఏగానీ లేదు. నువ్వు సెప్పిందే నిజం. మన తే పోకిళ్ళు వద్దు. హాయిగా, నిచ్చింతగా, భద్రంగా వుందాం యేం ?"

భాస్కరం కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. నీడలో ఆమెకి ఆ దృశ్యం కనబడ్డంలేదు.

"ఏమిటో చిత్రం—— సుఖంగా వుంటే ఏడుపొస్తుంది- చెడిపోతే ఏడుపొస్తుంది- మంచిగా వుంటే ఏడుపొస్తుంది- నీకు రావడంలేదు."

"నిన్ను సూస్తుంటే నాకూ దిగులుగా వుంది. ఎందుకు కంట నీ రెట్టుగుంటా భాస్కరం" దగ్గరగా జరిగి చీరకొంగుతో అతని కన్నీటిని తుడుస్తోంది. అతని గడ్డం ఆమె కొప్పు పీద ఆనించి వొచ్చే కన్నీటిని తల్లో పువ్వులతో తుడిచి ఆమెను విడిచేశాడు.

"నిన్ను తాకనేకూడదు కదూ ?"

"అవును మనస్సు పదిలంగా వుంటే అదే శాన"

పది నిముషాలు మాటల్లేకుండా, చీకటికేసీ, వెన్నెలకేసీ చూస్తూ కూర్చున్నారు. వూళ్ళో కుక్కలు ఒక్కసారిగా పేట్రేగి అరవటం మొదలెట్టాయి.

"ఎందుకలా అరుస్తాయి ?— అరుస్తే దొంగ లడతారంటారు — కొంపలో నూసొద్దామా ?" అంటూ లేచింది. సీతారత్నం పిల్లను భుజాన వేసుకుని, ఇద్దరూ ఆమె ఇంటివైపు నడుస్తూన్నారు. గదిలో మంచంమీద పిల్లని పడుకోబెట్టింది. దీపం పెద్దదిజేసింది పంజరంలో చిలక ఆహ్వా నిస్తూన్నట్లు పలుకుతోంది. దొడ్డివైపు వసారాలో చాపేసింది. రెండుదిండ్లు తెచ్చింది. గంపలో ముంజిలు తెచ్చింది. తినమంది. భాస్కరం తింటు న్నాడు.

"నువ్వేవో మంచి పనులు చేశావంటగా !"

"నా మొహం. నే నేం చేశాను. అదే ఆశ్చర్యంగా వుంది. ఇదంతా నిజమా, లేక చలమయ్య పుట్టించాడా ?"

"ఇంకా నయం. ఇట్లాంటివి పుట్టించడానికి పీల్లేదుగా. ఐదెట్టి పాఠాలు సెపుతుండావుగా— రాట్నం ఒడుకుతుండా..."

"సరె. యిదేం గొప్ప- ఎందరు చెయ్యడంలా ! తానైతే మనం ఏపీ చెడ్డపనులు చెయ్యలేదు — ఎవణ్ని చంపలేదు — డబ్బుకోసం తలలు ముడెట్టడం లేదు. దొంగతనము లేదు... మరి... మరో ఆకతాయి తిరుగుళ్ళు లేవు... ఏం నవ్వుతావేం !"

సీతారత్నం నవ్వుతూ వెన్ను వాల్చింది. గాలికి చీర రొమ్ముమీద నుంచి తొలుగుతోంది. కొప్పులో దవనం దిండు మీదికి రాలింది.

పక్కకి తిరిగి కొంగు కప్పుకుంది.

"అసలట్టాంటి పోకిళ్ళ బుద్ధులు మనస్సులో కూడా వుండగూడ దంటారు కాదా ఏం ! మరి నీ కుదదిగా."

(6)

"మనస్సులో యేమున్నది యెవడికి తెలుస్తుంది ? బయటికి కన బడేది చేస్తేనే నలుగురూ చెప్పుకుంటారు."

'ఊఁ' కొడుతూ సీతారత్నం నిద్రలోకి జారింది 'వింటున్నావా?' యిటు చూడు అంటూ భాస్కరం మాట్లాడుతూనే వున్నాడు.

చిత్రమైన మనిషి సీతారత్నం. ఆమె మనస్సులో ఏముందో తన కర్థమైనట్లుంది కాని, నిజంగా అర్థంకాదు. అల్లా వెన్నెలలో కొమ్మల చివర మెరుస్తున్న చెట్ల ఆకుల్ని చూస్తున్నాడు. మెరుపు తగ్గింది — చంద మామ మేఘం వెనక మరుగుపడింది. ముంగీస చెట్టుపక్క కొచ్చి, అటూ యిటూ చూసి గడ్డిలోకెళ్ళిపోయింది. దూరంన ఎప్పుడో నిశ్శబ్దాన్ని చీల్చుకొచ్చిన నక్క అరుపు వినబడుతోంది. ఆ చప్పుడు కూడా నిలిచి పోయింది. ఒక్క కీచురాయి మాత్రం రోదిస్తూంది. ఎక్కడ? ఆ రోదన వచ్చినవైపు కెళ్ళి ఇస్ మన్నాడు. అదీ నిలిచిపోయింది. సీతారత్నం శ్వాస వినబడుతోంది. గాలికి చీర కొంగు తొలిగింది. ఆమె స్థనాలు లేచిపడుతున్నాయి. బొడ్డుకింద అరటిపండు చీర మడత కిందికి జారింది. లోతయిన బొడ్డు కనిపిస్తూంది— పొరలు పొరలుగా రేగిన పొట్టమీద చర్మం. అల్లా చూస్తూ కూర్చున్నాడు. మనస్సు నిర్మలంగా, శాంతంగా వున్నట్లుంది. మాటలు లేవు, కోర్కెలు లేవు. ఆలోచన లేదు. తనెవరు! ఆమెవరు— వారి మధ్య ఏముంది. ఈ ప్రశ్నలు కూడా నిలిచిపోయి ఏదో గాలిలో తేలి, వెన్నెట్లో కలిసిన ప్రాణంలా— నిప్పులో పొగలా మాయమై కళ్ళు మూతలు పడ్డట్టుకూడా తెలియ దతనికి.

ఏమో, ఎంతైందో ? ఆమె చెయ్యి అతని మొహం మీద పడింది. చివాలున లేచి కూర్చున్నాడు.

'దాహంగా వుందా ? అక్కడ కుండలో నీళ్ళు తెస్తావా అంటోంది సీతారత్నం. కంఠం బరువుగా, బద్ధకంగా వుంది. మాటల్లో జీర వుంది— అతని కిష్టమైన జీర. మంచినీళ్ళు త్రాగాడు.

"వెళ్ళిపోమాక— నాకు భయం" అంది.

అతనేమీ మాట్లాడలేదు. కోడి కూసింది.

"తెల్లారిం దేమిటి చెప్మా !"

అతను చాపమీద వెన్ను వాల్చాడు.

ఆమె కూర్చుని వుంది.

"నిద్రపోలేదా ! పండుకో" అంది.

"చూడు;" అని ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె గట్టిగా విదిల్చింది. ఆమె ఉంగరాల వేళ్ళమధ్య అతని వేలు నలిగి 'అబ్బ' అన్నాడు.

"నొప్పా" అని అతని వేలు నవరిస్తూంది.

"మాట్టాడు— ఊ పోతునిద్ర" అంది

"ఒక నిర్ణయాని కొచ్చేశాను. నేను గాంధీగారి మనుషుల్లో చేరిపోకుండా యిదంతా ఆ దొర్ల పన్నాగం అనుకో. మెదలిస్తే ఇంక నే నోరు మెదపనుగా. వీళ్ళకి ఒకటే శాస్తి. మనిద్దరం దూర దూరంగా వుండటం— యీ ముసుగులో గుద్దులాటా, ఏమిటి ?"

"అదేమిటి మళ్ళా మొదలెట్టా పాత పోకిళ్ళా— ఇందాక వొద్దని ఖరారు చేసుకుంటిమి గాదా ఏం! నిద్రమైకమా ?"

"కాదు— విను. ఈ మెడలు రావడంతో పెద్దమనిషని మాంచి పేరడిపోయింది. ఇంక మన మేం చేసినా ఫరవాలేదు. ఇది మన మంచికే ననుకో. మెడలూ వద్దు గిడలూ వద్దందా మనుకున్నా — గాని తీసుకుంటా— వద్దనను. దాంతోపాటు నిన్నూ దక్కించుకుంటాను."

"నీ కేదో చేటొచ్చింది భాస్కరం. ఊళ్ళోవాళ్ళ కోసమూ మన మట్టాగుంటటం— కూడదనుకుంటిమిగా, ఆ మాటమీదే నిలబడాలి. సూసే దేముడు లేడా యేం !

'దేముడు' అనగానే భాస్కరం మాట ఆగిపోయింది. భయపడ్డట్లు ఉలిక్కిపడ్డాడు. దేవుడు, పాపాలు, నరకం— అక్కడ రంపంతో కోయడము, సలసల కాగే నూనెలో వెయ్యడం— యివన్నీ ఊహలో కొచ్చాయి

కాబోలు. భయంలోంచి, ఒక మొండిధైర్యం తెచ్చుకున్నట్లు, ఆమెని తన మీదికి లాక్కున్నాడు.

"ఇప్పుడు మన మేం చేసినా ఫరవాలేదు. మంచి పేరడిపోయింది- చచ్చింతర్వాత, ఏమవుతామో ఎవడు చూడొచ్చాడు."

అతని పట్టు విదుల్చుకొంది సీతారత్నం.

"అవునవును. నీకు మెదలిచ్చినట్లు భగవంతుడి చిట్టాలో రాసుకుంటాడా ఏం?" అంటూ విరగబడి నవ్వుతోంది మెడలో హారాలు కదిలి చప్పుడయ్యాయి. గాజులు గలగలమన్నాయి.

"జోకొడతా - పండుకో - పసోడివి - నాకంటె చిన్నేగా..." పక్కకితోసి, జోకొడుతోంది. భాస్కరానికి నవ్వొస్తోంది.

"పండుకో, ఊళ్ళోవాళ్ళు మంచోడివని మెద లిస్తా వుంటే- ఆ మంచితనం నిలబెట్టుకోవాల. ఇప్పు డసలే కూడదూ నీ పోకిళ్లు."

గోడమీద బల్లి అరచింది.

"చూడు- నే చెప్పింది నిజం, బల్లి కూస్తావుంది. మన మెప్పుడూ ఇట్టాగే మంచోళ్ళుగా స్నేహంగా ఉండాలి. పొగ లేకుండా నిప్పుంటం మాదిరి... తప్పు సెప్పానా ? పొగ లేకుండా నిప్పు, నిప్పు లేకుండా పొగా... ఏమో నాకు తెల్దులే..."

"నిద్రదే. కన్ను మూశా... ?" ఇంక తర్వాత ఆమె ఏమందో అతనికి తెలియదు.

కోడి కూసింది. తూర్పు ఆకాశంలో ఆవులిస్తూ సూర్యుడు కనులు నులుముకున్నట్టు ప్రభాతం ఒళ్ళు విరిచి చోటు చేసుకుంటోంది.

ఆ రెండు మూడు నెలలూ, వారిద్దరూ యీ విషయమే చెప్పుకొన్నారు. "మంచిపేరు పడిపోయింది గనుక మనం ఇష్ట మొచ్చినట్లు వుండొచ్చు." అని భాస్కరం, "అది వుందిగావున, పదిలంగా వుండ

కూడదా ఏం?" అని సీతారత్నమూ, "మెదలివ్వనీ-తర్వాత ఆలోచిద్దాం" అనడంతో అతను తృప్తిపడ్డాడు.

మెదలివ్వటం జరిగింది. అందరూ సంతోషించారు. నాగయ్య, వన సంతర్పణ ఏర్పాటుజేసి ఊరిపెద్దల్ని సంతోషపెట్టాడు.

మరో ఏడాది గడిచాక మళ్ళా భాస్కరం, సీతారత్నం పొలంలో కలుసుకొన్నారు. తోటలో చిన్న రెండుగదుల "బంగళా" కట్టించాడు- నాగయ్య. అందులో గృహప్రవేశం జరిగిన సందర్భం. దూరంగా ఇసుక పూరిగడ్డి కుప్పలుగా వేసివుంది. నల్లకుక్క కెలుకుతోంది. అక్కడికొచ్చింది సీతారత్నం.

"ఏమంటావ్- మనం పెట్టుకొన్న గడువు తీరిందిగా అన్నాడు భాస్కరం.

"మరో రెండు మూడేళ్ళు పోనిస్తూ- మూడేళ్ళకోపాలంటగా యీ మెద లివ్వటం. ఈ కాస్తపాటికే పేరు పాడుజేసుకొంటావా ఏం ? ఆ రందరూ కూడబల్కున్నారంటే ఆ మెదలు కాస్త లాగేసుకుంటారేమో- పదిలంగా వుండు" అంది రత్నం.

అతనికి నవ్వొచ్చింది. అతని వళ్లు వేడెక్కుతోంది. ఆ చల్లటి ఇసుకలో మరీ వేడిగా కనపడుతూం దతనికి.

"నువ్వు చెప్పింది నిజమేలే" అని సమాధానంగా కుదుర్చుకున్నాడు.

ఆ మూడేళ్లు గడిచినై. తన పెద్దకూతురు 'పాపాయి'కి సంబంధాలు చూట్టంలో గడిచిపోయింది నాలుగో ఏడు. ఆ పిల్లకి వివాహం చేశారు. తరువాతి సంవత్సరం నాగయ్యగారి అబ్బాయి సంగయ్యనీ, తన కొడుకునీ కాలేజీలో జేర్చటం, అందుకోసం ఆ బస్తీలో మకాం చెయ్యడంతో సరి పోయింది. "ఇంకా ఇప్పుడేమిటి పోనిస్తూ పెద్దోళ్ళమైపోయాంగా- నిప్పు లేదు, పొగలేదు..." అంది సీతారత్నం. అల్లా నిక్షేపంగా గడిచాయి

వారి జీవితాలు. పై సంవత్సరం పిల్లని కన్నాక పార్వతి చనిపోయింది. ఆ ఏడాది దుఃఖంతో వెళ్ళింది. నలుగురూ వోదార్చారు. మళ్ళా పెళ్ళి చేసుకోమన్నారు. తనకి అలాంటి అభిప్రాయాలు లేవన్నాడు భాస్కరం.

మరో ఏడాదికి తేరుకున్నాడు. సీతారత్నం తనకి ఎక్కువగా కావల్సి వచ్చినట్లు చెప్పుకున్నాడు ఆమెతో.

"పార్వతికి అన్యాయం ఎట్లా చెయ్యనూ !" అంది. "ఇందులో అన్యాయం లేదు మొదటినుంచీ మనిద్దరము ఇట్లాగే వున్నాం. ఆమె పోయింది- మహాఇల్లాలు. యిప్పుడే నన్ను ఆదుకోవాలి..."

"పార్వతికోసమన్నా సరే నంటాలే" అంది సీతారత్నం. సంతోషంతో ఎగిరి గంతేశాడు, అవకాశంకోసం వేచివున్నాడు. సీతారత్నం కూతురు రాధమ్మకి సంబంధాలు చూస్తున్నారు ఆఖరికి కుదిరింది. ఆ ఏడు పెండ్లి జరిగింది. పెళ్ళివారు, రాకపోకలూ, హడావుడి సందడి.

మరో ఎనిమిది నెలలకి తాను ఒంటరిగా గడిపే అవకాశమొచ్చింది. "రేతిరికి చెప్పుకుందాంలే" అంది సీతారత్నం. ఆ సాయంత్రమే నాగయ్య బండిలో వెడుతుండగా పక్షవాతము వచ్చి, కాలు కదలకుండా పడిపోయాడు. యింటికి తీసుకొచ్చేశారు. వైద్యులు, మందులు... ఎనిమిది నెలల తర్వాత మరోమారు పక్షవాతం ప్రకోపించి చనిపోయాడు. ఆ దుఃఖంనుండి తేరుకోడానికి ఏడాది పట్టింది. పెద్దవాడి చదువు ఉద్యోగంలో ప్రవేశించాడు. తల్లిని తనతో వచ్చి ఉండాలన్నాడు. భర్తతో ఇన్నాళ్ళా గడిపిన ఊరూ, యిల్లూ విడిచి రానంది.

"మనిద్దరికీ ఎవ్వరూ లేరు— కలసి వుంటేనేం !" అన్నాడు భాస్కరం.

"ఇప్పుడసలు కలవనేకూడదు. దూరంగా వుండటములో సుఖానుభూతి లేకుండా స్థిమితంగా లేదా ఏం?" అని కంట నీరెట్టుకుంది సీతా

"నీ కిష్టం లేకపోతే— బలవంతం చెయ్యనుస్మా.

"కోపమా ? కోపమంటే, సరేనంటా"

"ఆ మాట చాలు..."

ఆ రాత్రే కలుసుకుందామని నిశ్చయం చేసుకున్నారు.

పొద్దుగూకుతూ వుండగా, హృద్రోగంతో చనిపొయ్యాడు భాస్కరం. అతనికోసం వస్తున్న సీతారత్నం ఆ కబురు విని నేలమీద పడిపోయింది.

ం ం ం

కాని ఇట్లా జరగలేదు. నిజానికి మామయ్య చెప్పిన కథ ఇంత ఇప్పుడేమి పోనిస్తూ పెద్దోళ్ళ మైపోయాంగ నిప్పూలేదు, పొగా లేదు" అంది సీతారత్నం. ఇల్లా నిష్ప్రేచీగా గడిచాయి వారి జీవితాలు – అన్న వాక్యంతో ముగిసింది.

మిగతా దంతా, వారి కథను చివరంటా ఊహలో నడిపి, దానికొక ఆకృతి, కళానుగుణమయిన ముగింపు సమకూర్చాలన్న దృష్టితో చేసిన కల్పనే.

కథ ముగిసిన తర్వాత, అత్తయ్య నడిగాను.

"ఏవమ్మా అత్తయ్యా, పొగ లేకుండా నిప్పు రాజేస్తావుట. ఎలా సాధ్యం ?"

"యేముందిరా–కుంపట్లో బొగ్గులు మండాలంటే బాగా విసరాల్రా విసిరినంత సేపూ పొగ రాదుగా" అని అంది.

ఇందులో ఏదో గూడార్థం వుందని కాని, ఇది మావయ్య చెప్పిన కథకి వ్యాఖ్యానం అనికాని అనుకోవడం లేదు నేను.